శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

విక్రమ సింహపురి యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్లు అందుకున్న ప్రముఖులకు ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆత్మీయ సత్కారం

నెల్లూరు, జూన్ 9, ప్రభాతవార్త – వైద్యం నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో జరిగిన విక్రమ సింహపురి యూనివర్సిటీ స్నాతకోత్సవం సందర్భంగా బీఎంఆర్ సంస్థల అధినేత, ఎంపీ బీద మస్తాన్ రావు, శాంత బయోటెక్ కంపెనీ వ్యవస్థాపకులు కోదూరు ఈశ్వర వరప్రసాద్ రెడ్డిని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సత్కరించారు. బీద మస్తాన్ రావు, కోదూరు ఈశ్వర వరప్రసాద్ రెడ్డితో పాటు నీతి అయోగ్ సభ్యులు ప్రొఫెసర్ గోవర్ధన్ దాస్‌కు, డిగ్రీ పట్టాలు, బంగారు పతకాలు అందుకున్న విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేసారు.

రాష్ట్ర గవర్నర్‌కు కలెక్టర్ ఘన స్వాగతం

నెల్లూరు, జూన్ 9, ప్రభాతవార్త – కలెక్టరేట్ విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం 10, 11, 12వ స్నాతకోత్సవ (కాన్వొకేషన్) కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ మంగళవారం నెల్లూరుకు విచ్చేశారు. గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

విద్యే సమాజ మార్పుకు అత్యంత శక్తివంతమైన ఆయుధం

- విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ సభలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్

నెల్లూరు, జూన్ 9, ప్రభాతవార్త – వైద్యం ప్రపంచాన్ని మార్చడానికి ఉపయోగించగల అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య అని నెల్సన్ మండేలా చెప్పిన సందేశాన్ని గుర్తుచేస్తూ, విద్యార్థులు తమ విద్యను వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా సమాజ శ్రేయస్సుకు వినియోగించాలని రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ ఎస్. అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. మంగళవారం విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 10, 11, 12వ స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ కింద రూ.20 కోట్ల నిధులు మంజూరుకావడం, డీప్ ఓషన్ మిషన్ కార్యక్రమం కింద మెరైన్ బయాలజీ విభాగానికి రూ. 4.12 కోట్ల గ్రాంట్ లభించడం విశ్వవిద్యాలయ అభివృద్ధికి కొత్త అవకాశాలను తెరిచిందన్నారు. ఈ నిధుల ద్వారా పరిశోధన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ విద్య మరియు విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. విశ్వవిద్యాలయం చేపడుతున్న జాతీయ సేవా పథకం కార్యక్రమాలు, గ్రామీణాభివృద్ధి, నిరంతరం పెంపొందించుకోవాలని సూచించారు. కరుణ, నిజాయితీ, వినయం, పరస్పర గౌరవం వంటి విలువలను జీవితాంతం పాటించాలని పిలుపునిచ్చారు. భారతరత్న డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం సందేశాన్ని గుర్తుచేస్తూ ప్రపంచానికి మీ అత్యుత్తమ కృషిని అందించండి. అప్పుడు ప్రపంచం కూడా మీకు అత్యుత్తమ అవకాశాలు, గుర్తింపు, విజయాలను తిరిగి అందిస్తుంది అని పేర్కొన్నారు. యువత పెద్ద కలలు కనాలని, పట్టుదలతో కృషి చేస్తే ఏ లక్ష్యాన్నైనా సాధించగలరని ప్రోత్సహించారు. విశ్వవిద్యాలయం

ప్రసంగించారు. ఈ సందర్భంగా డా. కె.ఐ. వరప్రసాద్ రెడ్డి, ప్రొఫెసర్ గోబర్ధన్ దాస్, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు యాదవ్‌లకు విశ్వవిద్యాలయం ప్రదానం చేసిన గౌరవ డాక్టరేట్లపై అభినందనలు తెలిపారు. అలాగే డిగ్రీలు, పీజీ పట్టాలు, పీహెచ్‌డీలు మరియు స్వర్ణ పతకాలు అందుకున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం గత పదిహేడు సంవత్సరాలుగా నాణ్యమైన విద్య, పరిశోధన, సామాజిక సేవల ద్వారా విశేష ప్రగతి సాధించిందని గవర్నర్ ప్రశంసించారు. విశ్వవిద్యాలయం ఇటీవల నాక్ నుంచి 3.23 సీజీపీఏతో ఏ గ్రేడ్ పొందడం గర్వకారణమన్నారు. ఈ విజయంతో జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థానాలను సాధించే సామర్థ్యం విశ్వవిద్యాలయానికి ఉందని కమ్యూనిటీ డెవలప్‌మెంట్, కాలేజ్ టు విలేజ్, ల్యాబ్ టు ల్యాండ్ వంటి కార్యక్రమాలను గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ప్రస్తుత కాలంలో డిజిటల్ పరివర్తన, కృత్రిమ మేధస్సు ప్రాధాన్యం రోజురోజుకు పెరుగుతోందని పేర్కొన్న గవర్నర్, ఉన్నత విద్యాసంస్థలు సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించి విద్యార్థులను భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందుబాటులోకి రావాలంటే డిజిటల్ విద్యను విస్తృతంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు తమ వృత్తి జీవితంలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను చేపడుతున్న గో గ్రీన్ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ చర్యలు, సౌరశక్తి వినియోగం, స్మార్ట్ తరగతి గదులు, ఆర్ఎఫ్ఐడి ఆధారిత గ్రంథాలయ సేవలు వంటి కార్యక్రమాలను గవర్నర్ ప్రశంసించారు. విద్యా రంగం, పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంపొందించే వర్క్‌షాప్‌లు, సెమినార్లు, సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. చివరిగా పట్టభద్రులందరికీ మరోసారి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారు తమ జ్ఞానం, నైపుణ్యాలను సమాజ శ్రేయస్సు కోసం వినియోగించి దేశ అభివృద్ధికి తోడ్పడాలని గవర్నర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎంఎల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చాముండేశ్వరి బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట

- రెండేళ్ల కూటమి పాలనలో గంగపట్నానికి రూ.3.56 కోట్ల నిధులు - కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

ఇందుకూరుపేట, జూన్ 9, ప్రభాతవార్త ఇందుకూరుపేట మండలం, గంగపట్నం గ్రామంలో కొలువై ఉన్న చాముండేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలలో సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలని కోవూరు శాసనసభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. భక్తులకు సజావుగా దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం గంగపట్నం ఆలయ ప్రాంగణంలో ఈ నెల జూన్ 21 నుంచి జులై 2 వరకు 10 రోజుల పాటు జరగనున్న బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఆలయ చైర్మన్, పాలకమండలి సభ్యులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారి ఆలయంతో పాటు మొత్తం 8 ప్రముఖ పుణ్యక్షేత్రాలు ఉండడం నియోజకవర్గం ప్రజల అదృష్టం అన్నారు. జూన్ 21 నుంచి ప్రారంభమయ్యే అమ్మవారి బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని చెప్పారు. ముఖ్యంగా జూన్ 29న అమ్మవారి కళ్యాణోత్సవం, జూన్ 30న గంగోత్సవం, జులై 1న రథోత్సవం, జులై 2న తెప్పోత్సవం రోజుల్లో రద్దీ ఎక్కువగా ఉంటుందని, అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి లోటు లేకుండా చూడడమే మన లక్ష్యమన్నారు. అధికారులకు ఎమ్మెల్యే కీలక ఆదేశాలు బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల కోసం వివిధ ప్రభుత్వ శాఖలకు ఎమ్మెల్యే కీలక ఆదేశాలు ఇచ్చారు. దేవాదాయ శాఖ, భక్తుల రద్దీకి తగ్గట్టుగా ప్రత్యేక క్యూలైన్లు నిర్మించాలని, నిరంతర తాగునీటి సరఫరా, ఉచిత ప్రసాద వితరణ జరిగేలా చూడాలని చెప్పారు. ప్రత్యేక వాలంటీర్లను, ఇతర ఆలయాల నుంచి అదనపు సిబ్బందిని వాడుకోవాలన్నారు. పోలీసు శాఖ, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా రథోత్సవం, తెప్పోత్సవం రోజుల్లో ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ అధికారులు, ఆలయ పరిసరాల్లో, వీధుల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి, నిరంతరం బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. విద్యుత్ శాఖ ఉత్సవాల సమయంలో నిరంతరాయంగా కరెంట్ అందించాలని, రథోత్సవ మార్గంలో వైర్లు అడ్డురాకుండా చూడాలని ఎమ్మెల్యే చెప్పారు. అత్యవసర సేవలకై ఎలక్ట్రికల్ సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలన్నారు. అగ్నిమాపక శాఖ రథోత్సవం, తెప్పోత్సవం రోజులలో అగ్నిమాపక వాహనాలతో పాటు రక్షణ సామాగ్రి సిద్ధంగా ఉంచాలని, సిబ్బంది ప్రతిరోజూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రోడ్లు, భవనాల శాఖ ఉత్సవానికి ముందే రథాన్ని పరిశీలించి ఫిట్నెస్ సర్టిఫికెట్ ఇవ్వాలని, పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంటు, తెప్పోత్సవం రోజున తెప్ప ఏర్పాటును పర్యవేక్షించి సకాలంలో ఫిట్నెస్ సర్టిఫికెట్ జారీ చేయాలని సూచించారు. ఆరోగ్య శాఖ జూన్ 29 నుంచి జులై 2 వరకు 24 గంటలూ అంబులెన్స్ సౌకర్యంతో కూడిన ప్రత్యేక మెడికల్ క్యాంప్ నిర్వహించాలన్నారు. గంగపట్నం పంచాయతీలో రూ. 3.56 కోట్ల అభివృద్ధి పనులు గంగపట్నం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి గారు వివరించారు. గత ప్రభుత్వంలో ఒక్క పని కూడా మొదలుపెట్టలేదని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలోనే ఒక గంగపట్నం గ్రామంలోనే రూ. 3 కోట్ల 56 లక్షల 88 వేల నిధులతో అభివృద్ధి పనులు చేశామని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి నిధులలో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా చాముండేశ్వరి ఆలయంలో సీసీ రోడ్లకు రూ. 70 లక్షలు, అంతర్గత సీసీ రోడ్లకు రూ. 30 లక్షలు, విలేజ్ హెల్త్ సెంటర్ భవన పనులకు రూ. 36 లక్షలు కలిపి మొత్తం రూ. 1 కోటి 36 లక్షలు ఖర్చు చేశామన్నారు. ఇరిగేషన్ శాఖ ద్వారా పూడికతీత పనులకు రూ. 7.25 లక్షలు, గంగపట్నం ట్యాంక్ బండ్ రిపేర్లకు రూ. 9.55 లక్షలు, మిట్ట ట్యాంక్ పనులకు రూ. 4.75 లక్షలు, పంట కాలువల మరమ్మతులకు రూ. 17.43 లక్షలు కలిపి మొత్తం రూ. 38.98 లక్షల పనులు జరిగాయని చెప్పారు. తాగునీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) కోసం పైపు లైన్, బోర్లు, మోటార్లకు రూ. 25 లక్షలు, కాలువ మూల కండ్రిగలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ కోసం రూ. 37 లక్షలు కలిపి మొత్తం రూ. 62 లక్షలు ఖర్చు చేశామన్నారు. విద్యుత్ శాఖ ద్వారా నూతన ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటుకు రూ. 11 లక్షలు, 40 కొత్త ఎలక్ట్రిక్ స్తంభాలు, వైర్ల మార్పిడికి రూ. 7 లక్షలు, ఆర్‌డిఎస్ఎస్ పథకం కింద రూ. 80 లక్షలతో 70 శాతం పనులు పూర్తి చేశామని, ఈ శాఖలో మొత్తం రూ. 98 లక్షల పనులు జరిగాయని ఎమ్మెల్యే తెలిపారు. వీటితో పాటు ముఖ్యమంత్రి సహాయ నిధి, కింద 12 చెక్కుల ద్వారా రూ. 21 లక్షల 90 వేలు పేదలకు అందించామన్నారు. నియోజకవర్గంలో రోడ్డు పనుల వేగవంతం గతంలో శంకుస్థాపన చేసి ఆగిపోయిన మైపాడు నెల్లూరు రోడ్డు పనులను శరవేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని, ఆ రోడ్డు పూర్తి చేసి ప్రజలందరికీ తెలుగుదేశం పార్టీ తరపున బహుమతిగా అందిస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ డబుల్ ఇంజిన్ సర్కార్‌లా, ప్రధాని మోదీ సహకారంతో అస్తవ్యస్తమైన ఆర్థిక వ్యవస్థను సరిదిద్దుతూ, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం, సూపర్ సిక్స్ పథకాలను అక్షరాలా సూపర్ హిట్ చేశామన్నారు. గత 37 ఏళ్లుగా పక్కన పడిపోయిన కిసాన్ సెజ్‌లో సీఎం చంద్రబాబు నాయుడు, లోకేష్ బాబు, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి చొరవతో కదలిక వచ్చిందన్నారు. అక్కడ దాదాపు రూ. 15,000 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు రాబోతున్నాయని, యువత ఉద్యోగాల కోసం వలస వెళ్లే అవసరం లేదన్నారు. ఇళ్ల స్థలాల అక్రమాలపై విచారణ గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాల కేటాయింపులో తీవ్ర అక్రమాలు జరిగాయని ఎమ్మెల్యే మండిపడ్డారు. కేవలం గంగపట్నం లేఅవుట్లలోనే రూ. 40 లక్షలకు అక్రమ కొనుగోళ్లు జరిగాయని గ్రామస్తులు తన దృష్టికి తెచ్చారన్నారు. రాబోయే రెండు నెలల్లో నియోజకవర్గంలోని ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలంతో పాటు, కట్టుకునేందుకు పక్కా ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రావెళ్ల వీరేంద్ర నాయుడు, ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, దేవస్థాన ఛైర్మన్ గుండాల కృష్ణారెడ్డి, బొద్దుకూరు సుధీర్, అవ్వారు ఏడుకొండలు, మారు బోయిన జనార్దన్ గౌడ్, మండల బిజెపి అధ్యక్షులు కైలాసం శ్రీనివాసులు రెడ్డి జనసేన నాయకులు గుడి హరికుమార్ రెడ్డి, గ్రామ నాయకులు, కూటమి నాయకులు, ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ 10, 11, 12వ స్నాతకోత్సవం

నెల్లూరు, జూన్ 9, ప్రభాతవార్త – వైద్యం విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం 10, 11, 12వ స్నాతకోత్సవ వేడుకలు మంగళవారం నెల్లూరు గొలగమూడి రోడ్డులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ విచ్చేసారు. ఈ ప్రతిష్ఠాత్మక వేడుకలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ ఛాన్సలర్ ఎస్. అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా నెల్లూరు లోక్‌సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి హాజరయ్యారు. అంతకు ముందు, స్నాతకోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌కు నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్ హెలిప్యాడ్ వద్ద ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేసి, సాదరంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాలలో విశేష సేవలందించిన డాక్టర్ కె.వి. వరప్రసాద్ రెడ్డి (పద్మభూషణ్ అవార్డు గ్రహీత, శాంతా బయోటెక్నిక్స్ ఛైర్మన్), గోబర్ధన్ దాస్ (నీతి ఆయోగ్ సభ్యులు), బీదా మస్తాన్ రావు (రాజ్యసభ సభ్యులు)కి గవర్నర్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గౌరవ డాక్టరేట్లు అందుకున్న ప్రముఖులకు వేమిరెడ్డి దంపతులు పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం, గౌరవ గవర్నర్‌కి కలియుగదైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ స్నాతకోత్సవంలో పట్టాలు అందుకున్న యూజీ, పీజీ విద్యార్థులతో పాటు, పీహెచ్‌డీ పట్టాలు అందుకున్న 21 మంది విద్యార్థులు, గోల్డ్ మెడల్స్ సాధించిన 45 మంది విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వేమిరెడ్డి దంపతులు ఆకాంక్షించారు. ఈ వేడుకలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, నెల్లూరు జిల్లాకు చెందిన ప్రముఖ నాయకులు, విశ్వవిద్యాలయ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, జిల్లా ఉన్నతాధికారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు డిఆర్సీ సమావేశానికి హాజరుకానున్న జిల్లా ఇంచార్జ్ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు, జూన్ 9 ప్రభాతవార్త – కలెక్టరేట్ రాష్ట్ర న్యాయ, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జ్ మంత్రి ఎన్ఎండి. ఫరూక్ ఈ నెల 10వ తేదీన (బుధవారం) నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం 9.00 గంటల నుండి 9.45 గంటల వరకు జిల్లా ప్రజాప్రతినిధులతో మంత్రి సమావేశమవుతారని తెలిపారు. అనంతరం ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే జిల్లా సమీక్షా కమిటీ (డీఆర్సీ) సమావేశంలో మంత్రి పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశంలో వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంపై సమీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. డీఆర్సీ సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల సూచించారు.

గ్రంథాలయ అభివృద్ధిలో ఉద్యోగస్తులది క్రియాశీల పాత్ర

- నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి

నెల్లూరు, జూన్ 9, ప్రభాతవార్త – వైద్యం గ్రంథాలయ అభివృద్ధిలో ఉద్యోగస్తులది క్రియాశీల పాత్ర అని నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి పేర్కొన్నారు. మంగళవారం గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని గ్రంథాలయాలలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపించినటువంటి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి గ్రంథాలయ ఉద్యోగస్తులను నెల్లూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శాలువాతో సత్కరించి, సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా గ్రంథాలయ ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రంథాలయ సేవలను ప్రజలకు మరింత చేరువచేయడం కోసం కృషి చేస్తున్నామని, గ్రంథాలయ సేవలను విస్తృతం చేయడం కోసం అనేక కార్యక్రమాలు చేస్తున్నామని, ఈ సంవత్సరం వేసవి విజ్ఞాన శిబిరాన్ని జిల్లాలో విజయవంతంగా నడిపించినటువంటి ఉద్యోగస్తులను అభినందించడం జరిగిందని, గ్రంథాలయం కోసం అంకితభావంతో పనిచేసే ఉద్యోగస్తులు ఉన్నారని, గ్రంథాలయాల అభివృద్ధిలో క్రియాశీల పాత్ర ఉద్యోగస్తులదని అందరు కలసి పనిచేసి గ్రంథాలయాన్ని అభివృద్ధి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ కుమార్ రాజా, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీహార్ బస్సు ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురి భౌతిక కాయాల తరలింపు

చెన్నై విమానాశ్రయం నుంచి నెల్లూరుకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి తాజా వివరాలు వెల్లడించిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

నెల్లూరు, జూన్ 9, ప్రభాతవార్త – వైద్యం : బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ సమీపంలో జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు యాత్రికుల భౌతిక కాయాలను వారి స్వస్థలాలకు చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురి మృతదేహాలను ఔరంగాబాద్ నుండి పాట్నాకు తరలించిన అనంతరం, ఇండిగో విమానం 6ని 619 ద్వారా హైదరాబాద్‌కు, అక్కడి నుంచి ఇండిగో విమానం 6ని 6174 ద్వారా చెన్నైకి తరలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ విమానం నేడు రాత్రి 10.05 గంటలకు చెన్నై టెర్మినల్1కు చేరుకోనుందని పేర్కొన్నారు. మృతదేహాలతో పాటు సమన్వయ బాధ్యతలు నిర్వహిస్తున్న సోమా పెంచల ప్రసాద్ ప్రయాణిస్తున్నారని తెలిపారు. చెన్నై విమానాశ్రయంలో మృతదేహాలను స్వీకరించి, అక్కడి నుంచి సురక్షితంగా నెల్లూరు జిల్లాకు తరలించి సంబంధిత కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. అలాగే ప్రమాదంలో గాయపడిన యాత్రికులకు వైద్య సేవలు, స్వస్థలాలకు తరలింపు కార్యక్రమాలను కూడా ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందన్నారు.

రాష్ట్ర అభివృద్ధి కూటమితోనే సాధ్యం
కావలి ఎమ్మెల్యే దుగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి వెల్లడి

కావలి, జూన్ 9 ప్రభాతవార్త : ఏపిలో తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీల ఎన్‌డిఏ కూటమిగా ఏర్పడి రెండేళ్ళు విజయవంతమైన పాలన పూర్తి చేసుకోవంతో కావలి నియోజకవర్గ బిజెపి ఆధ్వర్యంలో మంగళవారం ఏబీఎస్ కళ్యాణమండపంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. బిజెపి నాయకులు, కార్యకర్తలు, ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పిఎం నరేంద్రమోడీ తిరుగులేని మద్దతు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సమర్థవంతమైన సారధ్యంలో రెండేళ్లుగా ఏపి పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్దిలో పయనిస్తోందన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురైన కావలి నియోజకవర్గంను అగ్రగామిగి నిలపడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. రాబోయే కాలంలో మౌళిక వసతులు, సాగునీరువంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. బిజెపి కార్యకర్తల త్యాగాలు కష్టం అమూల్యమైనవని కొనియాడారు. బిజెపితో పాటు కూటమిలోని ప్రతి ఒక్క నాయకునికి, కార్యకర్తకు నేను అందుబాటులో ఉంటానని తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికి చేరువ అయ్యేలా కృషిచేస్తానన్నారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్‌కుమార్ అంచిపాక కమల, జిఎస్‌టి మండలి సభ్యులు కుట్టుబోయిన బ్రహ్మానందం, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సన్నిగంటి సీనయ్య, జీఎస్‌మి మండలి సభ్యులు అమరా వెంకట సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షులు పూనూరు మాధవరెడ్డి, రాష్ట్రకౌన్సిల్ సభ్యులు, వింత వెంకటరంగారెడ్డి, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు మామిడి వెంకటేశ్వర్లు, కిసాన్ మోర్చా సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ మర్రిబోయిన అనిత, నాయకులు పల్లపు చిట్టిబాబు, మంద కిరణ్‌కుమార్, లక్కరాజు భాస్కర్ జరుగుమల్లి జయకుమార్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి సభ్యురాలు స్థిరమైన జీవనోపాదిని రూపొందించుకోవాలి

- డిఆర్డిఏ పిడి నాగరాజు కుమారి



నెల్లూరు, జూన్ 9, ప్రభాతవార్త – కలెక్టరేట్ మంగళవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా సమాఖ్య కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం డిఆర్డిఏ పిడి నాగరాజకుమారి అధ్యక్షతన జిల్లాలోని 37 మండల సమాఖ్య అధ్యక్షులు హాజరైనారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు డైరెక్టర్ డిఆర్‌డిఏ మాట్లాడుతూ మన సంస్థలకు సమావేశాలు సక్రమంగా నిర్వహించుకుని సభ్యులు సంస్థలను బలోపేతం చేసుకోవాల కోరారు. ప్రతి సభ్యురాలు స్థిరమైన జీవనోపాదిని రూపొందించుకొని స్థిరమైన ఆదాయం పొందాలని వ్యవసాయం, పశుపోషణ వంటి ప్రాథమిక రంగాలు మాత్రమే కాకుండా విలువ జోడింపు వంటి జీవనోపాధులను ఎంపిక చేసుకుని సభ్యులు ఎక్కువ ఆదాయం పొందవచ్చు విలువ జోడింపు, చేసే యూనిట్‌లను సభ్యులు ఏర్పాటు చేసుకుంటే అందుకు అవసరం అయిన ముడిసరుకుల కొనుగోలుకు, ఉన్నతి బ్యాంకు లింకేజీ మొదలగు పథకముల ద్వారా ఆర్థిక సహాయం పొందవచ్చునని తెలిపారు

పంటకాలువలో వ్యక్తి మృతి

అల్లూరు, జూన్ 9 ప్రభాతవార్త : అల్లూరు మండలం లో బీరంగుంట రైస్‌మిల్ కాలనీ సమీపంలోని పంట కాలువలోవ్యవసాయ కూలీ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వరినాట్లు వేయుటకు పశ్చిమబెంగాల్ నుంచివచ్చిన వారిలో లలుబరద(27) అనే వ్యక్తి గత మూడు రోజుల నుంచి విరోచనాలు కారణం గా నీరసించి రైస్‌మిల్ కాలనీ సమీపంలో కలువ వద్దకు వెళ్ళి కాలుజారీ పడి మృతి చెందాడని ప్రాథమిక విచారణలో తెలిసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అల్లూరు ఎస్ఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

బీహార్‌రోడ్డు ప్రమాద మృతదేహాల తరలింపుకు అధికారుల చర్యలు

సంగం జూన్ 9ప్రభాతవార్త బీహార్‌రాష్ట్రంలోని ఔరంగబాద్ సమీపంలో జరిగిన ఘూరరోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంగం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు ,హజరత్తయ్య మృతదేహాలను స్వగ్రామానికి తీసుకుచ్చేందుకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంగం మండలం అధికారులు చర్యలను వేగవంతం చేశారు. మృతదేహాలను స్వీకరించి సంగం మండలానికి తీసుకొని వచ్చేందుకు తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు,ఎస్ఐ బోజ్యానాయక్ చెన్నై విమానాశ్రమానికి చేరుకున్నారు. సంబంధిత అధికారుల సమన్వయం చేసుకుంటు మృతదేహాల తరలింపు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. అన్ని ప్రక్రియలు పూర్తి అయిన అనంతరం మృతదేహాలను ప్రత్యేక వాహనంలో సంగం మండలానికి తరలించనున్నారు.ఈ రాత్రికి మృతదేహాలు స్వగ్రామానికి చేరుకునే అవకాశం ఉన్నట్లు అదికారులు తెలిపారు. ఈవిషాద ఘటనతో సంగం మండలంలో తీవ్ర విషాద చాయలు అలుముకోగా మృతుల కుటుంబసభ్యులు,బంధువులు కన్నీరు మున్నీరువుతున్నారు.

వేడుకగా పాలేటి గంగమ్మ తల్లి గ్రామోత్సవం

సంగం జూన్ 9ప్రభాతవార్త సంగంలోని శ్రీపాలేటి గంగమ్మ తల్లి ఆలయంలో వైభవంగా జాతర మహోత్స వం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో అత్యంత వైభవంగా పాలేటి గంగమ్మ తల్లి గ్రామోత్స వం జరిగింది. ఆచార సాంప్రదాయాల ప్రకారం ఉత్స వం ముందు వీరతాళ్ళను కొట్టుకొని యాదవ సోదరులు తమ భక్తిని చాటుకున్నారు. గ్రామోత్స వం ముందు వివిధ వేష దారణలు అమ్మవారిని దర్శించుకొని నైవేద్యాలు సమర్పించారు.మండలంలో చుట్టుపక్కల నుండి ఈకార్యక్రమాలలో పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

టిడిపి నాయకులను హెచ్చరించిన వైసిపి నాయకులు

కావలి, జూన్ 9 ప్రభాతవార్త : కావలి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసిన కావలి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదంటూ వైసిపి నేతలు తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా వైసిపి కార్యాలయంలో జిల్లా కార్యదర్శి నెల్లూరు వెంకటేశ్వర్లురెడ్డి అధ్యక్షతన మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వైసిపి నాయకులు అక్కిలి గుంట మాల్యాద్రి వెంగళ శెట్టి కళ్యాణి, నాయబ్‌రసూల్, ఎండి మునీర్, ఉప్పాలమహేష్,,ముక్కు సురేష్, పాశం శేషగిరిరావు, వీఎంఆర్ మాలి తదితరులు నాయకులు మాట్లాడారు. కూటమి పార్టీకి చెందిన కొంతమంది నాయకులు మాజీ ఎమ్మెల్యేను వ్యక్తిగతంగా దూషించడం ఏంటని ప్రశ్నించారు. రాజకీయ అజ్ఞానులతో వ్యక్తిగత ప్రతిష్టలను భంగపరిచే విధంగా మాట్లాడించడం ప్రసుతత ఎమ్మెల్యేకి సబబు కాదని తెలిపారు. సామాజిక వర్గాల ప్రజలు మీ దుశ్చర్యలను గమనిస్తున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడిడ అమ్మతప థ కంకు సంబందించి సిబిఐ ఎంక్వయిరీ కోరారని ప్రభుత్వ భూమిని గుర్తించిన 126ఎకరాల భూమిలో 50 ఎకరాలకు పెన్సింగ్ చేయాలని కోరారని మనీ స్కాంలో దోచుకున్న 100కోట్లలో 50కోట్లు బాధితులకు చెల్లించాలని అనడం జరిగిందని దానికి టిడిపి నాయకులు పొంతన లేని సమాధానం చెబుతూ వ్యక్తిగత దాడులకు దిగడం సమంజసంగా లేదన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్దిచెబుతారని తెలిపారు. ఈకార్యక్రమంలో వైసిపి నాయకులు,కార్యకర్తలుపాల్గొన్నారు.

మద్దాలి కండ్రిగలో.. అంగన్‌వాడీ పిలుస్తోంది

కోట, జూన్ 9 ప్రభాతవార్త బడి బయట పిల్లవాడు ఉండకూడదన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఐదేళ్లు పూర్తి చేసుకున్న పిల్లలను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యంగా మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జూన్ 1 నుంచి 20వ తేదీ వరకు అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాల నిర్వహణకు శ్రీకారంచుట్టింది. ఇందులో భాగంగా అన్ని క్లస్టర్ల పరిధిలో కార్యకర్తలకు ఐసిడిఎస్ సూపర్ వైజర్ కవిత ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని మంగళవారం మద్దాలి కండ్రగ, కేశవరం, అల్లంపాడు గ్రామాల్లో అంగన్‌వాడీ పిలు స్తోంది కార్యక్రమం జరిగిరింది. ఈ నెల 12న అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ఇంటింటికి వెళ్లి వివరించాల్సి ఉందన్నారు. 20వ తేదీ వరకు గర్భిణులు, బాలింతలు, తల్లులను చైతన్యంచేసే క్రమంలో అవగాహనర్యాలీలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించినట్లు కవిత వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర్‌బాలికలు పాల్గొన్నారు

గిరిజన కుటుంబాలకు నెలవారీ నిత్యావసర సరుకుల పంపిణీ

తోటపల్లి గూడూరు, జూన్ 9, ప్రభాతవార్త మండలంలోని మల్లిఖార్జునపురం గ్రామంలో నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు నెలవారీ నిత్యావసర సరుకులతో కూడిన స్వాగత కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నియోజకవర్గ బాధ్యులు సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి ఆదేశాల మేరకునిర్వహించబడింది. సెల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం యాజమాన్యం అందించిన సహకారంతో ఈ సరుకుల పంపిణీ చేపట్టినట్లు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ వెంకటరమణయ్య, జీవరత్నం తెలిపారు. సమాజంలోని ఆర్థికంగా వెనుకబడిన గిరిజన కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని వారు పేర్కొన్నారు.

అరగల క్రిష్ణయ్యను పరామర్శించిన కావలి ఎమ్మెల్యే

కావలి, జూన్ 9 ప్రభాతవార్త :కావలి మండలం చెన్నా యపాలెంలో వైసిపి మాజీ ఏఎంసి ఛైర్మెన్ సన్నిపోయిన ప్రసా ద్, ఉమామహేశ్వర్‌రావు అనుచరులు టిడిపి మాజీ సర్పంచ్ అరగల క్రిష్ణయ్యతో పాటు మరి కొందరిపై మారణాయుదాతలతో దాడి చేసిన సందర్భంగా దాడిలో గాయపడిన క్రిష్ణయ్య ప్రాణాప్రాయ స్థితిలో ప్రస్తుతం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నందున కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి మంగళవారం వైద్యశాలకు వెళ్లి ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్తితిని వైద్యులను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని బాధ్యులను వెంటనే శిక్షించాలని అధికారులను ఎమ్మెల్యే కోరారు. బాధిత కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



కోట,జూన్ 9 ప్రభాతవార్త ప్రభుత్వ ఆదేశ్యాల మేరకు ఏపీఐఎంఎస్ 2.0 యూప్ ద్వారా రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాదికారి ఎం.సుచ్చేంద్ర ప్రసాద్ చెప్పారు. మంగళవారం ఆయన కోట మండలంలోని కోట, విద్యానగర్‌ల్లో ఎరువుల దుకాణంలో ఏపీఐ ఎంఎస్ 2.0 యూప్ ద్వారా రైతులకు పంపిణీ చేయ విధానంపై అవగాహన కల్పించారు. రైతులు ఇప్పటి నుంచి ఎపీఏఐ ఎంఎస్ ద్వారానే యూరియా,డీఎపీ, ఎరువుల పంపిణీ చేస్తామన్నారు. కాబట్టి ప్రతి రైతుల తప్పకుండా తమ దగ్గరలోని రైతు సేవ కేంద్రానికి వెళ్లి ఏపీఐఎంఎస్. యూప్‌లో ఫార్మర్‌రిస్ట్రే షన్ చేయించుకోవాలని కోరారు. యూప్ ద్వారానే పంటను బట్టి ఎరువులు మోతాదులు కేటాయించడం జరుగుతుందన్నారు.కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాల నుంచి రైతుకు అందే సబ్సిడి ఇతర పథకాల అన్నీ ఈ యూప్ ఆధారంగానే వస్తాయన్నారు. దీని ద్వార ఎరువులు పక్క దారి మళ్ల కుండా నేరుగా రైతుకే చేరుతాయన్నారు.

గోనుపల్లి హైవే పక్కను గుర్తు తెలియని వృద్ధుడు మృతి



రాపూరు,జూన్ 9ప్రభాతవార్త మండలంలోని గోనుపల్లి హైవే పక్కన వున్న టాయిలెట్స్ వద్ద సుమారు 70 నుండి 73 సంవత్సరాల వయస్సు వున్న వృద్ధుడు మంగళవారం మృతి చెందినట్లు రాపూరు ఎస్ఐ కె.తిరుమల రావు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు మృతదేహాన్ని రాపూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో భద్రపరచడం జరిగిందన్నారు. ఈ వ్యక్తికి సంబందించిన వివరాలు ఎవరికైనా తెలిసివుంటే పోలిసులకు సమాచారం అందించాలని కోరారు.

కనీసం శిక్షణ అయినా ఇప్పించండి

- ఎంపీడీవోలు ఎస్ఈని డిమాండ్ - పంచాయతీరాజ్ ఎస్ఈపై ఎంపీడీవోల ధ్వజం

నెల్లూరు, జూన్ 9, ప్రభాతవార్త – కలెక్టరేట్ కేంద్ర ప్రభుత్వానికి చెందిన విలేజ్ హెల్త్ సెంటర్ల నిర్మాణం.. ఉపాధి హామీ పథకానికి సంబంధించిన పనులకు టెండర్లు తీసే విషయమై మండల పరిషత్ అధికారులు పంచాయతీరాజ్ సూపరిండెంట్ ఇంజనీర్ కోటేశ్వరరావు పై ధ్వజమెత్తారు. స్వచ్ఛ రథం కార్యక్రమానికి సంబంధించి పంచాయతీరాజ్ కమిషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొనేందుకు మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయానికి వచ్చిన ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన ఎంపీడీవోలతో జెడ్పి సీఈవో శ్రీధర్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి చెందిన విలేజ్ హెల్త్ సెంటర్ల నిర్మాణంపై సరైన సమాచారం ఇవ్వకపోవడం కాంట్రాక్టర్లను సంతకాల కోసం నేరుగా తమ వద్దకు పంపుతుండడంపై కోవూరు ఎంపీడీవో శ్రీహరి పంచాయతీరాజ్ ఎస్ఈని ప్రశ్నించారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకానికి సంబంధించిన పనులకు ఎంపీడీవోలు టెండర్లు పిలిచే ప్రక్రియకు సంబంధించి ఎంపీడీవోలు ఎస్ఈని నిలదీశారు. సాధారణంగా పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఈఈ పంచాయతీరాజ్, ఎస్ఈ పంచాయతీరాజ్ కార్యాలయాలలో జరుగుతుంటుందని పేర్కొన్న ఎంపీడీవోలు వాటిపై కనీస అవగాహన లేని తమపై ఆ బాధ్యత పెట్టడం ఏమిటంటే ప్రశ్నించారు. కనీసం అందుకు సంబంధించి తమకు శిక్షణ అయినా ఇప్పించాలని ఎంపీడీవోలు ఎస్ఈని డిమాండ్ చేశారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా పంచాయతీ అధికారి వసుమతి సెన్సెస్ ప్రక్రియకు సంబంధించిన సూది కార్యకలాపాలు పూర్తి చేయాలని, అక్షరాంతర కార్యక్రమానికి సంబంధించి చదువుకునేవారు. చదువు చెప్పేవారిని ఎంపిక చేయాల్సి ఎంపిక చేయాలన్నారు. ఇక గ్రామాలలో పరిస్థితి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆమె ఈ సందర్భంగా ఎంపీడీవోలుకు సూచించారు.

వేదగిరి నిత్యాన్నదాన పథకానికి 25,116 రూపాయల విరాళం

నెల్లూరు, జూన్ 9, ప్రభాతవార్త – అగ్రికల్చర్ నెల్లూరు రూరల్ మండలం, నరసింహకొండ పై వేదగిరి క్షేత్రగా వెలసియున్న శ్రీ వేదగిరి లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకం నిరాటంకంగా జరుగు తోంది. ఈ కార్యక్రమానికి పలువురు దాతలు స్పందించి తమ వంతు విరాళాలను అందిస్తున్నారు. మంగళవారం నెల్లూరు ఇరుగాళమ్మ గుడి ప్రాంతం, సాయి నగర్‌కు చెందిన గండవరపు శివయ్య, అనిత దంపతులు, శివయ్య తల్లిదండ్రుల జ్ఞాపకార్థం 25,116 రూపాయలను దేవస్థాన కార్య నిర్వహణాధికారి వేమూరి గోపికి చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ వేదగిరిపై నిత్యాన్నదాన పథకానికి సహకరిస్తున్న దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. శివయ్య తల్లిదండ్రులైన సుబ్బయ్య, వెంకమ్మ ఆశీర్వాదాలు వారి కుమారుడు కోడలిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. అలాగే వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆది లక్ష్మమ్మ అమ్మవారి ఆశీస్సులతో శివయ్య దంపతులు మరెన్నో ఇలాంటి సేవా కార్యక్రమాలను చేసి ప్రజాధరణ పొందాలని కోరుకున్నారు. విరాళం అందజేసిన శివయ్య దంపతులకు స్వామి అమ్మవార్ల దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. దేవస్థానంలో జరుగుతున్న పూజా కార్యక్రమాలు, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు సంతృప్తిగా జరుగుతున్నాయని దేవస్థాన సిబ్బందిని శివయ్య దంపతులు కొనియాడారు.

గర్భవతుల చికిత్సలో నిర్లక్ష్యం తగదు : డాక్టర్ ఎస్ కే ఖాదర్ వలీ

నెల్లూరు, జూన్ 9, ప్రభాతవార్త – వైద్యం నెల్లూరు నగర పరిధిలోని కోటమిట్ట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ కళ్యాణ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 47, 48, 49 డివిజన్లోని గర్భవతులను పరీక్షించి వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా 2016 నుంచి 2026 వరకు పది వసంతాలు పూర్తి చేసుకున్నందుకు పీఎం ఎస్ఎంఎస్ ప్రోగ్రాంలో అడిషనల్ డీఎంహెచ్వో డాక్టర్ ఎస్ కే. ఖాదర్ వలీ ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి సిబ్బందికి పలు సూచనలు చేశారు. హై రిస్క్ గర్భవతులను గుర్తించి వాళ్ళకి వెంటనే చికిత్స అందించాలని, అలాగే అనీమియా గర్భవతులను గుర్తించి వారికి ఐరన్సుక్రోజ్ అందించి ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు కూడా అందించి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్య సేవలు అందుబాటుఖాని పరిస్థితుల్లో రిఫరల్ మెటర్నరీ హాస్పిటల్‌కి పంపించాలని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు ఏఎన్ఎంలు, ఆశాలు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలనపై టీడీపీ అవగాహన సదస్సు

మాజీ ఎమ్మెల్యే కంభం

వింజమూరు, జూన్ 9, ప్రభాతవార్త ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని 18 ఏళ్లు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి పిలుపునిచ్చారు. వింజమూరులోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా పునఃపరిశీలన (సర్) అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద యగిరి నియోజకవర్గ పరిధిలోని వింజమూరు, కలి గిరి, కొండాపురం జలదంకి మండలాలకు చెందిన తెలుగు దేశం పార్టీ నాయకులు బూత్ స్థాయి ప్రతిని ధులు కార్యకర్తల కోసం ఈ ప్రత్యేక అవగాహన సద స్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కంభం విజ యరామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ద్వారా ఓటరు జాబితాలను మరింత పారదర్శకంగా ఖచ్చితంగా రూపొందించవచ్చు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ఓటరు జాబితాలోని తప్పులను సరిచేయడం, మరణించిన లేదా అర్హత కోల్పోయిన వారి పేర్లను తొలగించడం, నకిలీ ఓట్లను గుర్తించి తొలగించడం, అలాగే కొత్త గా అర్హులైన వారిని జాబితాలో చేర్చడం అని వివరించారు.ఓటరు జాబితాలో కొత్తగా పేర్ల నమోదు, పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, వ్యక్తిగత వివరాల సవరణలు, ఒక నియోజకవర్గం నుంచి మరో నియో జకవర్గానికి బదిలీ వంటి అంశాలపై ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఆయన సవివరంగా తెలియజేశారు. ఇప్పటికే ఓటరుగా ఉన్న ప్రతి ఒక్కరూ తమ వివరాలను ఒకసారి సరిచూసుకుని, తప్పులుంటే వెంటనే సరిచేయించుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ, యువకుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి. దేశ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికల్లో యువత చురుగ్గా పాల్గొని, తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి" అని కంభం పిలుపునిచ్చారు. కొత్త ఓటర్ల నమోదులో పార్టీ శ్రేణులు ప్రత్యేక శ్రద్ధ వహించి, అర్హులైన ప్రతి ఒక్కరినీ జాబితాలో చేర్పాలని కోరారు. ఇంటింటి సర్వే, ముందస్తుగా నింపిన ఫారాల ధృవీకరణ ద్వారా ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని తెలిపారు. బూత్ కన్వీనర్లు, బీఎల్ఓలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్ ప్రాముఖ్యతను ప్రతి ఇంటికీ తెలియజేయాలని, ఓటరు జాబితాలో ఎలాంటి అవకతవకలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అర్హులైన ఓటర్లందరూ జాబితాలో ఉండేలా చూడటం, ప్రజాస్వామ్య విలువలను కాపాడటం ప్రతి కార్యకర్త బాధ్యత. గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు సమన్వయంతో పనిచేసి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాంఅని కంభం పిలుపునిచ్చారు. ఈ సదస్సులో టీడీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు బూత్ కన్వీనర్లు, యువజన, మహిళా విభాగాల నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు టీడీపీ మండల సమావేశం మండల కన్వీనర్

వింజమూరు, జూన్ 9, ప్రభాతవార్త వింజమూరు మండల తెలుగుదేశం పార్టీ సమావేశం బుధవారం స్థానిక ఎస్వీ కన్వెన్షన్ హాలులో జరగనుందని మండల టీడీపీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ముఖ్య అతిథిగాహాజరవుతారని ఆయన వెల్లడించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు చెందిన టీడీపీ నాయకులు క్లస్టర్ ఇంచార్జ్‌లు, బూత్ కన్వీనర్లు, ఎంపీటీసీలు పార్టీ అభిమానులు ఇతర నాయకులు తప్పకుండా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నర్సారెడ్డి కోరారు. ఈ సమావేశంలో గడిచిన రెండేళ్ల కాలంలో పార్టీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లే అంశంపై చర్చించనున్నారు. అదేవిధంగా వింజమూరు పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించడం మండలంలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన నిర్ణయాలపై కీలకంగా చర్చించనున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు కార్యాచరణపై కూడా ఈ సమావేశంలో దిశానిర్దేశం చేయనున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ శ్రేణులంతా సమయానికి హాజరై, మండల అభివృద్ధికి, పార్టీ పటిష్టతకు తమ విలువైన సూచనలు, సలహాలు అందించాలని కన్వీనర్ నర్సారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశం మండల టీడీపీ భవిష్యత్ కార్యాచరణకు కీలకంగా నిలవనుందన్నారు.

పులిగిలపాడులో క్రషర్ ఏర్పాటుపై నేడు ప్రజాభిప్రాయ సేకరణ

రాపూరు,జూన్ 9ప్రభాతవార్త పులిగిలపాడు గ్రామ సమీపంలో నూతనంగా స్టోన్ క్రషర్ ఏర్పాటుకు సంబందించి క్వారీకి అనుమతులు ఇచ్చేందుకు బుదవారం సంబందింత భూమి వద్ద ప్రజా భిప్రాయ సేకరణ కార్యక్రమం జిల్లా అధికారులు నిర్వహించనున్నట్లు పులిగిలపాడు గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికే ఇక్కడ వున్న స్టోన్ క్రషర్‌లతో అనేక ఇబ్బందులు తాము పడుతుండగా మరలా మరో స్టోన్ క్రషర్ ఏర్పాటు చేయడం ఎమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రజాభిప్రాయాన్ని పంచాయితీలో నిర్వహించాల్సి వుండగా ప్రజభిప్రాయం విషయాన్ని కేవలం పులిగిలపాడులో మాత్రమే దండోరా ద్వారా తెలియపరిచారాని పంచాయితీ పరిధిలోని రావిగుంటపల్లి, బొజ్జనపల్లి, వీరాయపాళెంలో అసలు దండోరా కూడా వేయలేదని వారు ఆరోపిస్తున్నారు.

అనుమానం పెనుభూతమై..

- నగరంలో వివాహిత దారుణ హత్య - లొంగిపోయిన నిందితుడు..

నెల్లూరు క్రైం, జూన్ 9, ప్రభాతవార్త: నగర శివారులోని పడారుపల్లి చెరువు కట్ట వద్ద మంగళవారం జరిగిన దారుణ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివాహేతర సంబంధం నేపథ్యంలో చోటుచేసుకున్న గొడవ, ఒక మహిళ ప్రాణాలను బలితీసుకుంది. తనను మోసం చేసిందన్న అనుమానంతో ప్రియుడే అత్యంత దారుణంగా ఆమెను కత్తితో పొడిచి చంపాడు. సేకరించిన సమాచారం మేరకు కనుపర్తిపాడు గ్రామానికి చెందిన రేవంతి (35)కి, సుమన్ అనే వ్యక్తితో 18 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. అయితే, భర్తతో వచ్చిన మనస్పర్ధల కారణంగా ఆమె గత కొంత కాలంగా పిల్లలతో కలిసి కనుపర్తిపాడులోనే ఒంటరిగా నివాసం ఉంటోంది. ఈ క్రమంలో స్థానికుడైన కడప శ్రీకాంత్ అనే యువకుడితో ఆమెకుపరిచయం ఏర్పడింది. ఈపరిచయం కాలక్రమంలో వివాహేతర సంబంధానికి దారితీసింది. కొంత కాలం సజావుగా సాగిన వీరి బంధంలో గత రెండు నెలలుగా విభేదాలు మొదలయ్యాయి. రేవంతి మరో వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడుతోందని, ఆమె ప్రవర్తనలో మార్పు వచ్చిందని శ్రీకాంత్ అనుమానించేవాడు. ఈ విషయమై వారిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. తనను మోసం చేస్తోందన్న కోపంతో రేవంతిని అంతం చేయాలని శ్రీకాంత్ పథకం రచించాడు. మంగళవారం రేవంతి, శ్రీకాంత్ ఇద్దరూ వ్యక్తిగత పనుల నిమిత్తం నెల్లూరు నగరానికి కలిసి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో, పడారుపల్లి చెరువు కట్ట సమీపానికి రాగానే మళ్లీ ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ముందుగానే సిద్ధం చేసుకున్న కత్తితో శ్రీకాంత్ రేవంతిపై విచక్షణారహితంగా దాడిచేశాడు. తీవ్రరక్తస్రావం కావడంతో ఆమెఅక్కడికక్కడే ప్రాణాలుకోల్పోయింది. హత్య అనంతరం నిందితుడు శ్రీకాంత్ నేరుగా వేదాయపాలెం పోలీస్ స్టేషన్‌కువెళ్లి, తాను రేవంతినిహత్య చేసినట్లు అంగీకరిస్తూ పోలీసుల ఎదుటలొంగిపోయాడు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సం ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికితరలించి, కేసు నమోదుచేసిదర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

వెంకట్రావుపల్లిలో ఖేత్‌బచావో అభియాన్ కార్యక్రమం

ఉదయగిరి, జూన్ 9, ప్రభాతవార్త ఉదయగిరి మండల పరిధిలోని కొండాయపాలెం పంచాయతీలో గల వెంకట్రావుపల్లి నందు మంగళవారం ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయవిశ్వవిద్యాలయం పరిధిలోఉన్న మేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ క ళాశాల ఆధ్వర్యంలో ఉదయగిరి మండల పరిదిలోని వెంకట్రావుపల్లి గ్రామంలో మంగళవారం మన భారత ప్రభుత్వ కార్యక్రమమైన భేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా విభాగాధిపతులు డాక్టర్ ఎన్.సునీత డాక్టర్ మిట్ట కిషన్ తేజ్ మండల వ్యవసాయాధికారి విజయ్ కుమార్, సహాయ అచార్యులు డాక్టర్ పి.శోభారాణి, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కీటక శాస్త్రవిభాగాధిపతి డాక్టర్ మిట్ట కిషన్ తేజ్ మాట్లాడుతూ గత పదేళ్ల నుండి విపరీతంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా వివిధ పంటల దిగుబడి తగ్గుతూ వస్తుందని, ఆ కారణంగా పంటభూములు తగ్గిపోతున్నాయని అన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ, భవిష్యత్తు తరాలకు సురక్షితమైన ఆహార భద్రత కల్పించడం ఈ ఖేత్ బచావో అభియాన్ ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి వ్యవసాయ ఉప సంచాలకులు ఏవో విజయభాస్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెంచిన పెట్రోల్ డీజిల్ నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలి : సీపీఎం రైతు సంఘం డిమాండ్

ఉదయగిరి, జూన్ 9, ప్రభాతవార్త కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన పెట్రోల్, డీజిల్ నిత్యవసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక బస్టాండ్ సెంటర్లో సీపీఎం రైతు సంఘం సీఐటియు ఆటో కార్మికులు హమాలీయాలతో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతున్న ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. యుద్దాల పేర్లతో అమాయక ప్రజల జీవన విధానాలతో చెలగాటమాడుకునేందుకు నిత్యవసర వస్తువులను పెట్రోల్, డీజిల్ ధరలను అధికంగా పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నారని, ఇంత జరుగుతున్న యుద్దాలను ఆపే ప్రయత్నం చేయక యుద్ధం జరిగిన అనంతరం ఇప్పుడు అధిక ధరల మోత మోగిస్తున్నారన్నారు. దీనితో అన్ని రకాల కార్మికులు ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడిపోతున్నారన్నారు. ముఖ్యంగా పట్టణంలోని ఆటో కార్మికులకు వాహనాలు నిలిపేందుకు స్టాండ్ ఏర్పాటు చేయాలన్నారు. వారికి రక్షణ కల్పించేందుకు తగు చర్యలను తీసుకోవాలన్నారు. అర్హత కలిగిన ప్రతి ఆటో కార్మికులకు సొంత ఇండ్లను నిర్మించి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయ, సీఐటీయు నాయకులు గడ్డం నాగేశ్వరరావు, ఆటో కార్మికులు హమాలీలు అనుబంధ సంఘ నాయకులు పాల్గొన్నారు.

నేడు అధికారులకు,ప్రజా ప్రతినిధులకు శిక్షణ

రాపూరు,జూన్ 9ప్రభాతవార్త మండల కేంద్రమైన రాపూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో బుదవారం మండల స్థాయి అధికారులకు,ప్రజా ప్రతినిధులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు యంపీడీఓ పి. వసుందరమ్మ తెలిపారు. ఆర్.జి.ఎస్.ఎ ఆధ్వర్యంలో 2026..27కు సంబందించి పంచాయితీ డెవలప్‌మెంట్ ప్లాన్ తయారీపై ఈ సమావేశం ఉదయం 9.30 నుండి సాయంత్రం 5వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి అందరూ మండల ప్రజాపరిష్ సభ్యులు, జిల్లా పరిషత్ సభ్యులు, మండల స్థాయి అధికారులు అందరు తప్పని సరిగా హాజరు కావాలని ఆమె కోరారు.

సీనియర్ అయ్యప్ప గురుస్వామి మునుస్వామి మృతి

రాపూరు,జూన్ 9ప్రభాతవార్త రాపూరు మండలంలో సీనియర్ అయ్యప్ప స్వామిగా అందరికి పరిచయమున్న ముచ్చేలి మునుస్వామి స్వామి(85) మంగళవారం మృతి చెందారు. ఈయన దాదాపు 48 సంవత్సరాలుగా ప్రతి ఏడాది క్రమం తప్పకుండా అయ్యప్ప స్వామి దీక్ష తీసుకోని నియమ,నిష్టలతో స్వామి దీక్ష ఆచరించేవారు. గత కొంతకాలంగా స్వల్ప అనారోగ్యంతో వున్న మును స్వామి స్వామి గుడూరులోని తన పెద్ద కుమారిని దగ్గర వున్నారు. ఈయన అంత్యక్రియలు బుదవారం గూడూరులో నిర్వహించనున్నారు.

ఏపీఎఐఎంఎస్ 2.0 ద్వారా యూరియా, డీఏపీ పంపిణీ సజావుగా కొనసాగింపు

తోటపల్లి గూడూరు, జూన్ 9, ప్రభాతవార్త: మండలంలో రైతులకు యూరియా, డీఏపీ ఎరువుల సరఫరాను ఏపీఎఐఎంఎస్ 2.0 అనువర్తనం ద్వారా పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి తెలిపారు. పంటలు సాగు చేసిన రైతులందరూ మండలంలోని ప్రైవేటు ఎరువుల విక్రేతలు, సహకార సంఘాలు లేదా తమకు అనుకూలమైన విక్రేతల వద్ద ఏపీఎఐఎంఎస్ 2.0 అనువర్తనం ద్వారా ఎరువులను పొందవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. అనువర్తనంలో రైతు పేరు కనిపించని పక్షంలో ఆందోళన చెందాల్సి న అవసరం లేదని, సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. వ్యవసాయ సహాయకులు రైతుల వివరాలను అనువర్తనంలో నమోదు చేసిన అనంతరం రైతులు విక్రేతలు లేదా సహకార సంఘాల ద్వారా ఎరువులను పొందవచ్చని వివరించారు. ఈ సందర్భంగా తోటపల్లి గూడూరు సహకార సంఘంలో ఏపీఎఐఎంఎస్ 2.0 అనువర్తనం ద్వారా సుమారు 30 మంది రైతులకు యూరియా ఎరువులను సజావుగా పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న డిజిటల్ సేవలను సద్వినియోగం చేసుకొని, అవసరమైన ఎరువులను సకాలంలో పొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.

గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను సత్కరించిన ఎమ్మెల్యే

కోవూరు,జూన్ 9 ప్రభాతవార్త: విక్రమ సింహపురి స్నాతకోత్స వానికి మంగళవారం నెల్లూరుకు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా స్వాగతం పలికారు.

ఆదరణ కేంద్రంలో ఆప్యాయ అన్నదానం

పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

బిట్రగుంట, జూన్ 9 ప్రభాతవార్త: బోగోలు మండలం తెల్లగుంట గ్రామానికి చెందిన పచ్చ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగమూరు తోట సమీపంలోని ఆదరణ కేంద్రం, భవాని ఎడ్యుకేషన్ సొసైటీ ఆశ్రమంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బిట్రగుంట ఎస్సీ బాలికల హాస్టల్, ఎస్సీ బాలుర హాస్టల్, బీసీ బాలుర హాస్టళ్లకు చెందిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులు, నిరాశ్రయులకు భోజనాలు వడ్డించి ఆప్యాయంగా పలకరించారు. పూర్వ విద్యార్థుల ప్రతినిధులు గుర్రం మాల్యాద్రి, జ్యోతి బాలకులు ముఖ్య అతిథులుగా పాల్గొని సేవా కార్యక్రమాల ప్రాధాన్యాన్ని వివరించారు. సమాజంలో సేవాభావం పెంపొందాలని ఆకాంక్షించారు. వద్దే సంపూర్ణమ్మ, గంగపట్నం శ్రీనివాసులు, పొంగులూరు వెంకటేశ్వర్లు, మంగమ్మ, మేరీ తదితరులు పాల్గొన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పలువురు పేర్కొన్నారు.

మెథడ్స్ ప్రీ కోచింగ్ వలననే మేము ఉత్తీర్ణత పొందాము

కావలి, జూన్ 9 ప్రభాతవార్త : మెథడ్స్ ప్రీ కోచింగ్ మెటీరియల్ వల్లే తాము సులభంగా ఉత్తీర్ణత పొందామని కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొంది ఉత్తీర్ణతలైన ఇన్సర్వీస్ టీచర్లు తెలిపారు. గతంలో మెథడ్స్ సెంటర్‌లో శిక్షణపొంది ఉత్తీర్ణత సాధించిన ఇన్‌సర్వీస్ టీచర్లకు స్థానిక జనతాపేట నార్త్‌లో ఉన్న మెథడ్స్ కోచింగ్ సెటర్ నందు మంగళశారం అభినందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గత టెట్‌లో ఉత్తీర్ణత సాధించిన పెంకుల ప్యాక్టరీ స్కూల్ పిఎస్‌హెచ్ఎం పి.మురార్జీ, ఆంధ్రకేసరి స్కూల్ పిఎస్‌హెచ్ఎం ఎస్.అనిల్, ఆంధ్రకేసరి స్కూల్ హెచ్ఎం, మధు, పాత టౌన్ తెలుగు స్కూల్ అసిస్టెంట్ గంగయ్యలు పాల్గొని వారి అనుభవాలను తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం క్లాసులు వింటూ ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో పరీక్షలు రాస్తే ఖచ్చితంగా విజేతలు అవుతారని తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు గతటెట్‌లో మంచి మార్కులు సాధించినప్పటికీ, ఇంకా మంచి మార్కులు సాధించుట కోసం మరలా కూడా రాస్తానని తెలిపారు. అనంతరం డైరెక్టర్ ఐ.శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్క ఇన్‌సర్వీస్ టీచర్స్ ఉచితంగా కోచింగ్‌ని ఉపయోగించుకోవాలని, మెటిరీయల్‌ని చక్కగా వినియోగించుకోవాలని టెట్‌కు సంబందించి మీకు ఏమైనా సందేహాలు ఉంటే 9247445194కు సంప్రదించాలని తెలిపారు.

శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో ఘనంగా క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

కావలి, జూన్ 9 ప్రభాతవార్త :స్థానిక శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ విజయవంతంగా ము గిసింది. ఈ కార్యక్రమంలో కళాశాలలకు చెందిన వివిధ విభాగాల నుంచి 30మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో 16మందికి ప్రముఖ సంస్థలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈఇంటర్వ్యూలు ప్రముఖ సంస్థలైన పాక్స్ కాన్,జప్టో సంస్థలు నిర్వహించారు. ఇందులో బాల బాలికలకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగింది. ఎంపికైన వారికి రూ.16నుంచి 22వేల వరకు వేతనంతో పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. బెంగుళూరుకు చెందిన కంపెనీ హెచ్ఆర్, ప్రతినిధులు ఎస్,లహరి, కె.రేవతి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. కళాశాల డైరెక్టర్ జానకిరామ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు వెళ్ళి ఉద్యోగ రంగంలో రాణించాలని ఆకాక్షించారు. ప్రిన్సిపాల్ వివిఆర్ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో ఎంఎంసి సంస్థలతో కలసి విద్యార్థులకు విస్తృత ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్.కె.కబీర్ అహ్మద్ కీలకపాత్ర పోషించారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం,సిబ్బంది అభినందించారు..

తూర్పుకంభంపాడులో వేసవి కిశోరి వికాసం

చేజర్ల, జూన్ 9, ప్రభాతవార్త చేజర్ల మండలం తూర్పు కంభంపాడు గ్రామం నందు వేసవి కిశోరి వికాసం కార్యక్రమం మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తల్లులు, కిశోరి బాలికలు పిల్లలు అందరూ పాల్గొనడం జరిగింది. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ పాల్గొని అవగాహన కల్పించారు. బాల్య వివాహాల గురించి అవగాహన కల్పించారు. అలాగే బాలికలు ఆపదలో ఉన్నప్పుడు 1098 హెల్ప్‌లైన్ నెంబర్ల గురించి వివరించారు. కిశోర్ బాలికల్లో ఉండే పోషకాహార లోపం రక్తహీనత వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు ఎక్కడ వివాహం చేసిన చట్టరీత్యా నేరమని తల్లిదండ్రులు శిక్షార్హులని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. మూడు సంవత్సరాల నిండిన ప్రతి బిడ్డను కూడా అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలని అంగన్‌వాడీ కేంద్రంలో ఆట పాటల ద్వారా మెరుగైన విద్య అందించడం జరుగుతుందని తల్లులందరికి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గర్భిణీ స్త్రీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి

కోవూరు,జూన్ 9,ప్రభాతవార్త : కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకంలో భాగంగా మిడ్వైఫరీ ఆధ్వర్యంలో గర్భవతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగాఎడ్యుకేటర్ ఏ.రాణికుమారి మాట్లాడుతూ గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవించే వరకు తల్లులు అనేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా ఐరన్ లోపం ఎక్కువగా కానవస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని గర్భవతులు ఆకుకూరలు, పండ్లు అధికంగా తీసుకోవాలన్నారు. ఈ గర్భందాల్చిన సమయంలో ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో ఉదాహరణ పూర్వకంగా ఎన్‌పీఎం శిక్షకులు చేసిచూపించారు. అనంతరం వారికి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే ఆసియా బేగం, కవిత, వెంకటేశ్వ రమ్మ, విజయమ్మ, శ్రీలేఖ, ఆస్పత్రి హెడ్ నర్సు ప్రసూనలతలు ఉన్నారు.

నేర్చుకున్న అంశాలను పాఠశాలలో అమలు చేయాలి

కోవూరు, **జూన్ 9, ప్రభాతవార్త** ప్రాథమిక స్థాయిలోని ఉపాధ్యాయులు శిక్షణా శిబిరంలో నేర్చుకున్న అంశాలను పాఠశాలలో అమలు చేసేలా ప్రత్యేక దృష్టి పెట్టలని ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ అన్నారు. కోవూరులోని జేబీ ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత వారం నుంచి జరుగుతున్న కోవూరు నియోజకవర్గ స్థాయి ఉపాధ్యాయుల శిక్షణా శిబిరం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రాథమిక దశలోనే విద్యార్థుల్లో ఉన్న అభ్యసనా సామర్థ్యాలను పూర్తిస్థాయిలో వెలికి తీసేందుకు ఈ శిక్షణా తరగతులు ఉపయోగపడతాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని పాఠశాలలో అమలు చేసినప్పుడే ఈ శిక్షణకు ఒక సార్థకత ఏర్పడుతుందన్నారు. ముఖ్యంగా ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు చదవడం, రాయడం, గణితం చేయడం వంటి వాటిపై దృష్టి పెడితే పైతరగతికి వచ్చే సరికి వారిలో అభ్యసనా సామర్థ్యాలు మరింత మెరుగుపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కేఆర్‌పీ మానస, డీఆర్పీ వేణుగోపాల్, శ్రీనివాసులు, వాసుబాబు, కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన ఉపాధ్యాయులు ఉన్నారు.

పెన్నా నదిలో గుర్తుతెలియని మృతదేహం కలకలం

కోవూరు **జూన్ 9, ప్రభాతవార్త** మండలం పరిధిలోని పెన్నా నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమవడంతో స్థానికంగా కలకలం రేగింది. మృతుడు సుమారు 50 సంవత్సరాల వయస్సు కలిగి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. మంగళవారం నదిలో చేపల వేటకు వెళ్లిన జాలర్లు మృత దేహాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న కోవూరు పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని, జాలర్లు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి గుర్తింపునకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

వైభవంగా పోలేరమ్మ చతుర్థ వార్షికోత్సవ వేడుకలు

(కోవూరు, జూన9 ప్రభాతవార్త : కోవూరులోని శాంతినగర్ మొదటి వీధిలో వెలసి ఉన్న శ్రీ పోలేరమ్మ దేవస్థానంలో మంగళవారం నాల్గవ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని దేవస్థానాన్ని విద్యుద్దీపాలతో వైభవంగా అలంకరించారు. ప్రాత:కాలమునే అమ్మవారికి రుత్వికులు అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష కుంకుమ పూజా కార్యక్రమాన్ని మహిళా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పంచాయతీ మేస్త్రీ తిరుపతయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్విఘ్నంగా కొనసాగాయి. అనంతరం పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కరెంటోళ్ళ జనబాట ద్వారా ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం

విద్యుత్ అంతరాయాల సమాచారం తప్పనిసరిగా ఉర్జా మిత్రలో నమోదు చేయాలి

రెవిన్యూ వసూళ్లు, డిజిటల్ పేమెంట్స్‌పై ప్రత్యేక దృష్టి - ఎస్.ఈ. కె. రాఘవేంద్రం

నెల్లూరు, జూన్ 9, ప్రభాతవార్త – వైద్యం ఈరోజు కరెంటోళ్ళ జనబాట కార్యక్రమంలో భాగంగా జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. రాఘవేంద్రం కావలి డివిజన్ పరిధిలోని కావలి టౌన్ రామ్మూర్తి పేటలో పర్యటించి, స్థానిక విద్యుత్ వినియోగదారులతో ప్రత్యక్షంగా సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయా న్ని సందర్శించి సంబంధిత సిబ్బందితో సమావేశం నిర్వహించారు. తదుపరి కావలి డివిజన్ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించిన జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ మాట్లాడుతూ, వినియోగదారుల సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి తక్షణ పరిష్కారం చూపాలనే లక్ష్యం తో కరెంటోళ్ళ జనబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతిమంగళ వారం ,శుక్రవారం నిరంతరంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఫీల్డ్‌లో గుర్తించిన లూజ్ లైన్లు, డామేజ్ అయిన పోల్స్, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్ఫార్మర్లు, చెట్ల కొమ్మలు విద్యుత్ లైన్లను తాకడం, కండక్టర్ డామేజ్ వంటి సమస్యలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి వెంటనే పరిష్కార చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే ఆర్డీఎస్ఎస్ (RDSS) పథకం ద్వారా ప్రతి పల్లెకు 24 గంటల నాణ్య మైన విద్యుత్ సరఫరా అం దించడమే లక్ష్యమని, జిల్లా అంతటా ఈ పథకం సమర్థవంతంగా అమలవుతోందని పేర్కొన్నారు.విద్యుత్ అంతరాయాల సమాచారం వెంటనే నమోదు చేయాలి.విద్యుత్ అంతరాయాలు ఎక్కడైనా సంభవించిన వెం టనే ఉర్జా మిత్ర (Urja Mitra)లో తప్పనిసరిగా నమోదు చేయాలని అధికారులకు ఆదేశించారు. సంబం ధిత వినియోగదారులకు అంతరాయం వివరాలను వెంటనే తెలియజేయాలని, అవసరమైన చోట APSPDCLApp లో కూడా సమాచారం అప్డేట్ చేయాలని సూచించారు. ఉర్జా మిత్ర ,ఇతర వ్యవస్థలలో నమోదు చేసిన సమాచారాన్ని కార్పొరేట్ కార్యాలయం నిరంతరం పర్యవేక్షిస్తోందని, ఎటువంటి నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు.

రెవిన్యూ వసూళ్లపై ప్రత్యేక దృష్టి ప్రస్తుతం విద్యుత్ రెవిన్యూ వసూళ్లు ఆశించిన స్థాయిలో లేవని, ప్రతి అధికారి మరియు సిబ్బంది రెవిన్యూ వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రతి సర్వీస్ వద్ద బకాయిల వివరాలను పరిశీలించి వినియోగదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి బిల్లుల చెల్లింపుపై అవగాహన కల్పించాలని సూచించారు.

రెవిన్యూ వసూళ్లు మెరుగుపడితేనే ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు, కొత్త కనెక్షన్లు, మరమ్మత్తులు వంటి పనులను వేగవంతంగా నిర్వహించగలమని తెలిపారు. ప్రతి అధికారి తమ పరిధిలో రోజువారీ వసూళ్లను సమీక్షిస్తూ లక్ష్యలను సాధించేందుకు కృషి చేయాలని ఆదేశించారు.డిజిటల్ పేమెంట్స్ వినియోగంపై అవగాహన కల్పించాలి.

డిజిటల్ పేమెంట్స్ వినియోగం ప్రస్తుతం చాలా సులభంగా మరియు వేగవంతంగా మారిందని తెలిపారు. వినియోగదారులు స్మార్ట్ ఫోన్ ద్వారా ఇంటి వద్ద నుండే విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చని చెప్పారు. Google Pay, BillDesk, APSPDCL App, Net Banking వంటి విధానాల ద్వారా కొన్ని నిమిషాల్లోనే సురక్షితంగా బిల్లు చెల్లించవచ్చని వివరించారు.డిజిటల్ చెల్లింపుల ద్వారా క్యాష్ తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదని, క్యూలలో నిలబడాల్సిన ఇబ్బంది తగ్గుతుందని, వెంటనే రసీదు పొందవచ్చని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ పేమెంట్స్‌పై అవగాహన పెంచే విధంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.సమయానికి బిల్లు చెల్లింపు – నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరాకు మద్దతు" అనే భావన ప్రతి వినియోగదారునికి చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

అందిన ఫిర్యాదులు ఫ్యూజ్ బాక్స్ ఏర్పాటు, బిల్లింగ్ సమస్యలు, లో వోల్టేజ్, నూతన సర్వీస్‌లకు సంబంధించిన సివిల్ వివాదాలు తదితర అంశాలకు సంబంధించినవని తెలిపారు. ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్లకు వెంటనే పంపించి, పరిష్కారం అనంతరం ఫోటోలతో కూడిన నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును అసిస్టెంట్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు స్వయంగా పరిశీలించి పరిష్కరిస్తున్నారని తెలిపారు. వినియోగదారులకు సంతృప్తికర సేవలు అందించడం శాఖ యొక్క ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కావలి బెనర్జీ , డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవి కుమార్ రెడ్డి , అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాసులు రెడ్డి, వసంత రావు,నాగార్జున, జడ్ రాయి, షరీఫ్, నాగూర్ వల్లి, సునీల్, ఏఏఓ రామాంజనేయులు ఇతర అకౌంట్స్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి

- వామ పక్షాలు ఆధ్వర్యంలో ధర్నా

గూడూరు, జూన్ 9, ప్రభాతవార్త నానాటికి పెరిగిపోతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సి.పి.ఎం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివ కుమార్ పేర్కొన్నారు. వామ పక్షాల రాష్ట్ర పిలుపు మేరకు గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద సీపీ ఎం, సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే నెలలో కేవలం 11 రోజుల్లో మోడీ ప్రభుత్వం నాలుగు సార్లు డీజిల్, పెట్రోల్ ధరలను పెంచి ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. యుద్ధం సాకుతో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను రోజు రోజుకి పెంచుతూ సామాన్యుల నడ్డి విరుస్తున్నారని ఎద్దేవా చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వలన రవాణా రంగం అస్తవ్యస్థానికి గురైందన్నారు. ఈ గ్యాస్ ధరలు వలన విద్యార్థుల, యువకులు చాలా రకాల ఇబ్బందులకు గురవుతున్నారు. విశాఖపట్నంలో గ్యాస్ నిల్వలు విపరీతంగా ఉన్నాయి. రిలయన్స్ కార్పొరేట్ శక్తులకు లాభాలు గడించే విధంగా కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. మన రాష్ట్ర భూభాగంలో ఉత్పత్తి అయ్యే గ్యాస్‌ను మన రాష్ట్ర ప్రజలు ఉపయోగించలేక పోవడం బాధాకరం అన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం మేలుకొని అందుబాటులో ఉన్న గ్యాస్‌ను మన రాష్టానికి వినియోగించుకొని ఇతర రాష్ట్రాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మోదీ తన 12 ఏళ్ల పరిపాలనలో దేశాన్ని చిన్నాభిన్నం చేశారన్నారు. కార్పొరేట్లుకు దారాదత్తం చేసి కార్మికులకు తీవ్ర నష్టం చేశారన్నారు.ఈ ధర్నా వలన వాహనాలు కిలో మీటరు పైగా వాహనాలు ఆగిపోయాయి. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్,గ్యాస్ ధరలను తగ్గించి, సామాన్యులకు అందుబాటులోకి తేవాలన్నారు. సీపీఎం నాయకులు పామంజీ మణి, బి.వి.రమణయ్య, ఎంబేటిచంద్రయ్య, అడపాల ప్రసాద్, బి.చంద్రయ్య, గండి కోట మధు, దారా కోటేశ్వరరావు, రమణయ్య, జానీ, గౌరి కిష్టయ్య,కోటి, ముఠా వర్కర్స్ శ్రీనివాసులు, వెంకయ్య,జనార్ధన్,సుబ్బారాయులు, పెంచలయ్య, నాగేంద్ర, యాదాల సునీల్, ఏఐ వై ఎఫ్ జిల్లా నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, ముఠా వర్కర్స్ నాయకులు వెంకటయ్య, ఏఐఎస్ఎఫ్ నాయకులు రిజ్వాన్, హర్షద్, బాలాజీ, హనీఫ్, దీవెన్, తదితరులు పాల్గొన్నారు.

నేరాల కట్టడికే కార్డెన్ సెర్చ్

- ఒకటవ పట్టణ సిఐ శేఖర్ బాబు



గూడూరు, జూన్ 9, ప్రభాతవార్త నేరాల కట్టడికే కార్డన్ సెర్చ్ అని గూడూరు ఒకటవ పట్టణ సిఐ శేఖర్ బాబు పేర్కొన్నారు. మంగళ వారం గూడూరు పట్టణ పరిధిలోని విఘ్నేశ్వర పురంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అనుమా నితులు కనపడితే పోలీసు లకు సమాచారం ఇవ్వాలి అన్నారు. 120 గృహాలను తనిఖీ చేశామన్నారు. సరైన పత్రాలు లేని 4 ద్విచక్ర వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. నేర రహిత సమాజం కొరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈయన వెంట ఒకటవ పట్టణ ఎస్ఐ మనోజ్ కుమార్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్య పర్యవేక్షణకు ఏఐ స్క్రీనింగ్ :సిడిపిఓ శారద

విడవలూరు, జూన్ 9 ప్రభాతవార్త: మండలం లోని రామతీర్థం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 0 నుంచి 6 ఏళ్లలోపు చిన్నారుల ఆరో గ్య పరిస్థితుల పర్యవేక్షణ కోసం కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత స్క్రీనింగ్ విధానంపై అంగన్వాడీ కార్యకర్తలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండో విడతలో పాల్గొ న్న కార్యకర్తలకు ఏఐ ఆధారిత స్క్రీనింగ్ విధానంపై అవగాహన కల్పించారు.ఐసీడీఎస్ సీడీపీవో శారద ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ చిన్నారుల ఎదుగుదల, ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూ పాల్సిన అవసరం ఉందన్నారు. జననం నుంచి ఐదేళ్ల వయస్సు వరకు ప్రతి చిన్నారి ఆరోగ్య వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఏఐ ఆధారిత యాప్లో నమోదు చేయాలని సూచించారు. తల్లులకు అనుకూలమైన సమయంలో, వారి సమక్షంలోనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. రామతీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నవచైతన్యం ప్రాజెక్టు ప్రాధా న్యాన్ని వివరించారు. చిన్నారి జీవితంలో తొలి వెయ్యి రోజులు అత్యంత కీలకమైనవని, ఆ సమయంలో సరైన పోషణ, ఆరోగ్య సంరక్షణతో భవిష్యత్ ఆరోగ్యానికి పటిష్ఠమైన పునాదులు ఏర్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ సురేఖ, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం

నెల్లూరు, జూన్ 9, ప్రభాతవార్త – వైద్యం 33/11 కెవి స్టోన్ హౌస్ పేట సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి తడికల బజార్ ఫీడర్ లో విద్యుత్ లైన్స్ పనుల కారణంగా రాజగోపాల పురం, రామచంద్ర పురం, రాఘవ స్కూల్ పరిసర ప్రాంతాలలో ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల జరుగునని విద్యుత్ ఏఇ ఎం. శ్రీధర్ తెలిపారు. వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, అత్యవసర విభాగం వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలియజేసారు.

రేపు చేజర్లలో సాధారణ సర్వసభ్య సమావేశం

చేజర్ల, జూన్ 9, ప్రభాతవార్త మండల కేంద్రమైన చేజర్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు గురువారం ఉదయం 11గంటలకు 21వ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అమర్ తెలిపారు. ఈ సందర్భంగా సాధారణ సర్వసభ్య సమావేశంలో వ్యవసాయం, పశుసంవర్ధకశాఖ, విద్యాశాఖ, గ్రామీణ మంచినీటి సరఫరా పారిశుధ్యం, గృహ నిర్మాణ శాఖ, అజెండాలోని పలు అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లుతెలిపారు. ఈసమావేశానికి మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

డాక్యుమెంట్స్ పోయినది

నా భర్తగారైన మండవ శ్రీరాములు బోగోలు మండలం, బిట్రగుంట గ్రామ సర్వే నెం.1 లోని ఎ.3.00 ఎకరాల భూమిని 07.07.1969 తేదీన దస్తావేజు నెం. 1487/1969 గా కావలి స.రి. ఆఫీసులో రిజిష్టరు పొంది మరణించగా నేను స్వాధీనము పొంది అనుభవించు కొనుచు 16.05.2026 తేదీన మునుసూరు గ్రామ సచివాలయంలో రెవిన్యూ రికార్డులలో నా పేరున మార్చుటకు దరఖాస్తు చేసుకొని ఆటో సెంటరుకు వచ్చు మందుగా మార్గ మధ్యలో పోయినది. దొరికినవారు తెలియచేయగలరు.

Manduva Sathyamma. Cell: 8185057619

మానసిక లోపాలను గుర్తించేందుకే నవచేతన

(కోవూరు, జూన్ 9 ప్రభాతవార్త : . కోవూరు మండలం గుమ్మల దిబ్బ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళ వారం అంగన్‌వాడీ కార్యకర్తలకు నవచేతన కార్యక్రమంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిరంజన్ మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి ఆరేళ్ల వయస్సు గల చిన్నారుల్లో మానసిక ఎదుగుదలను కృత్రిమ మేదస్సు ద్వారా గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించిందన్నారు. ప్రధానంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల్లో స్థూల, సూక్ష్మ చలనం, నైపుణ్యాలు , భాషా వికాసం, జ్ఞాన వికాసం సామాజిక భావోగ్వేగాలను నవచేతన ద్వారా అంచనా వేసేందుకు ఈ శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగిందన్నారు. గృహ సదర్శన సమయంలో చిన్నారుల్లో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే ఏఎన్‌ఎం దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నిర్మల, నవచేతన కార్యక్రమం ప్రధాన ఉద్దేశాన్ని వీడియో రూపంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

పెట్రోల్, డీజిల్, గ్యాస్ పెంపుదలకు నిరసనగా రాస్తారోకో

కోవూరు, జూన్ 9 ప్రభాతవార్త : . కోవూరులోని బజార్ సెంటర్‌లో వామపక్ష పార్టీల పిలుపుమేరకు మంగళవారం పెట్రోల్, డీజిల్ , గ్యాస్ ధరలకు నిరసనగా రాస్తారోకో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మోహన్‌రావు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం మే నెలలో కేవలం 11 రోజుల్లో నాలుగు సార్లు పెట్రోల్, డీజిల్‌ను పెంచి సామాన్యుల నడ్డి విరిచిందన్నారు. దీంతో పాటు వాణిజ్య గ్యాస్ ధరలను పెంచి చిన్న వ్యాపారుల జీవితాలను ఇబ్బందులకు గురి చేసిందన్నారు. మోడీ ప్రభుత్వం తమ 12 సంవత్సరాల పాలనా వైఫల్యాన్ని కప్పి పుచ్చుకోవడానికి యుద్ధాన్ని సాకుగా చూపిస్తుందన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల ధరలు భారీగా పెరిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. డీజిల్ ధరలు పెరగడంతో కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బుజ్జయ్య, ప్రజానాట్య మండలి కార్యదర్శి శేషయ్య, సీనియర్ వామపక్ష నాయకులు ఎస్‌కే బాబు, టి. రమేష్, పి. హరి, పెద్దబ్బయ్య, విజయ్‌కుమార్, గోవర్ధన్, కాలేషా, మోహన్‌దాస్, తదితరులు ఉన్నారు.

మోటార్ సైకిల్‌ను ఢీకొన్న కారు

- ఇరువురికి తీవ్రగాయాలు

కోవూరు, జూన్ 9 ప్రభాతవార్త : పొట్ట కూటి కోసం పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగించే రెండు కుటుంబాల్లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదం ఇబ్బందులకు గురి చేసింది.నెల్లూరులోని బాలాజీనగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు , అనిల్‌లు ఇరువురు పెయింట్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం నెల్లూరు ద్విచక్రవాహనంలో కావలివైపు ప్రయాణిస్తుండగా కోవూరులోని జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో వెనుక నుంచి వస్తున్న కారు మోటార్ సైకిల్‌ను వేగంగాఢీకొంది.ఈ సంఘటనలో అనిల్, వెంకటేశ్వర్లుకు తీవ్రగాయాల య్యాయి. గాయాలైన వీరిని 108 అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.ఈ మేరకు సంఘటనా స్థలాన్ని కోవూరు ఎస్సై ముత్యాలరావు పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యర్రబల్లికి బస్సు సౌకర్యం కల్పించాలి

ఆత్మకూరు ,జూన్9,ప్రభాతవార్త: మండలం లోని చివరి గ్రామమైన యర్రబల్లికి ఆర్టీసి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామ యువకులు ఆర్టీసి డిపో మేనే జర్ శివకేష్ యాదవ్‌కు వినతిపత్రంఅందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి దేవిడ్‌రాజు మద్ధతుతోకలిసి వారు డిపో మేనేజర్‌ను కలిసి ప్రస్తుతం బొటికర్లపాడు వరకు నడుస్తున్న బస్సును ఎర్రబల్లి వరకు పొడిగించాలనికోరారు. దీంతో గ్రామ ప్రజలకు,విద్యార్థులకు రవాణాసౌకర్యం మెరుగుపడుతుందన్నారు.

తప్పిపోయిన మహిళలను క్షేమంగా గుర్తించిన

ఏఎస్‌పేట పోలీసులు

అనుమసముద్రంపేట ,జూన్9,ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాకు చెందిన షేక్ అమీనాబేగం తన రెండవ కుమార్తె సాదియాబేగంతో కలిసి ఏఎస్‌పేట మండలంలోని దర్గాకు దర్శనార్థం వచ్చి రెండురోజులుగా అక్కడే ఉంటున్నారు. మంగళవారం ఉదయం 9.30గంటల సమయంలో షేక్ అమీనాబేగం తన కుమార్తె సాదియా బేగంనఉ దర్గా ప్రాంగణంలో కూర్చోబెట్టి టిఫిన్ తీసుకురావడానికి వెళ్లారు. తిరిగి ఆమె వచ్చి చూసే సరికితన కుమార్తె కనిపించకపోవడంతో వెంటనే ఏఎస్‌పేట పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న ఏఎస్‌పేట పోలీసులు వెంటనే స్పందించి స్థానిక సోషల్ మీడియా, వాట్సప్‌గ్రూపులకు, ఇతర సమాచార మాధ్యమాల ద్వారా తప్పిపోయిన మహిళ వివరాలను విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ క్రమంలో సాదియాబేగం ఆత్మకూరు పట్టణ పరిధిలోని నెల్లూరుపాళెం మసీదు సమీపంలోఉన్నట్లు గుర్తించారు.అనంతరం సాదియాబేగంను ఆమె తల్లి అమీనాబేగంకు అప్పగించారు. అందుకు ఆమె పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఎస్ఐ జిలానీ మాట్లాడుతూ తప్పిపోయిన వ్యక్తుల సమాచారం అందిన వెంటనే ప్రజలు పోలీసులకు తెలియజేస్తే వేగంగా గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. తప్పిపోయిన మహిళను త్వరితగతిన గుర్తించడంలో సహకరించిన ప్రజలకు , సోషల్ మీడియా వినియోగదారులకు , పోలీసు సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంలో విత్తన గుళికల తయారీపై అవగాహన

విడవలూరు, జూన్ 9 ప్రభాతవార్త: మండలంలోని అలగానిపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పీఎండీఎస్ విత్తనాలను గుళికలుగా తయారు చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా ప్రాజెక్టు నిర్వహణ కార్యాలయానికి చెందిన రవిచంద్ర ప్రసాద్ పర్యవేక్షణలో పీఎండీఎస్ విత్తనాలను గుళికలుగా తయారు చేసి, ముందుగా దున్నిన పొలంలో వాటిని చల్లారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. ప్రత్యేక పద్ధతిలో తయారు చేసిన విత్తన గుళికలు నేలలో పడిన తర్వాత మొలక శాతం పెరగడంతో పాటు, మొక్కల పెరుగుదలకు అవసరమైన పోషకాలు అందిస్తాయని వివరించారు. తద్వారా సాగు ఖర్చులు తగ్గి రైతులకు లాభదాయకమైన దిగుబడులు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జి. కవితారాణి, మోనిక, విజయలక్ష్మి , సురేష్, రాకేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

: తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి

కొడవలూరు, జూన్ 9 ప్రభాతవార్త: పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నార్త్ రాజుపాలెం ప్రత్యేక అధికారి, తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజల సహకారంతోనే మెరుగైన పారిశుధ్యం సాధ్యమవుతుందని తెలిపారు.అంటువ్యాధుల నివారణకు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పంచాయతీ సిబ్బంది చెత్త సేకరణ కోసం నిర్దేశించిన ప్రదేశాల్లోనే చెత్తాచెదారాన్ని వేయాలని, పారిశుధ్య నిర్వహణలో వారికి సహకరించాలని కోరారు. ప్రజలందరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే గ్రామాల్లో పరిశుభ్రతతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు. పారిశుధ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నార్త్ రాజుపాలెం ప్రత్యేక అధికారి, తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి పిలుపునిచ్చారు.

ప్రధానమంత్రి మాతృత్వ వందన పథకం సద్వినియోగం చేసుకోవాలి

కోవూరు, **జూన్ 9, ప్రభాతవార్త** కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రధానమంత్రి మాతృత్వ వందన పథకంను పారదర్శకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ ప్రతినుల 9వ తేదీ ఈ పథకాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించడం జరుగుతూనే ఉందన్నారు. సీహెచ్‌సీ పరిధిలోని గర్భవతులకు, రిజిస్ట్రేషన్, స్కానింగ్ ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన సల హాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. హైరిస్క్ ఉన్నవారు ఎవరైనా ఉంటే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుంద న్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు వారి వారి పరిధిలో ఉన్న గర్భవతులను తీసుకువచ్చి ఆరోగ్య పరీక్షలునిర్వహించడం జరుగుతుందన్నారు. మారుమూల ప్రాంతాల్లో ఉన్న గర్భవతులు ఎవరైనా ఈ కార్యక్రమంపై అవగాహన లేకపోతే వారికి కూడా సీహెచ్‌సీలో అవసరమైన పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి నెల 9వ తేదీ ఈ సీహెచ్‌సీలో 50 మందికి పైగా గర్భవతులకు అవసరమైన పరీక్షలు నిర్వహించడం జరుగుతూనే ఉందన్నారు.

– తహసీల్దార్ సేవలు స్ఫూర్తిదాయకం కోవూరు తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య ప్రత్యేకంగా చొరవ తీసుకుని ఈ ఆరోగ్య కేంద్రానికి పరీక్షల నిమిత్తం వచ్చే 50 మందికి పైగా గర్భవతులకు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని పంపిణీ చేయడం ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఇందుకు తహసీల్దార్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్ తెలిపారు. అనంతరం గర్భవతులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ సలావుద్దీన్, డాక్టర్ మయుద్దీన్, డాక్టర్ పద్మావతి, డాక్టర్ సంధ్య, డిప్యూటీ తహసీల్దార్ బషీర్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు, తదితరులు ఉన్నారు.

దివ్యాంగ మహిళలకు చీరలు పంపిణీ చేసిన టీవీఎస్ ట్రస్ట్

కావలి, జూన్ 9 ప్రభాతవార్త : పట్టణంలోని టివిఎస్(తోట వెంకటశేషయ్య) మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్‌ఆధ్వర్యంలో దివ్యాంగ మహిళలకు ఉచితంగా చీరల పంపిణీ కార్యక్ర మం ట్రస్ట్ ఛైర్మెన్ తోట వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రజావైద్యులు, కావలి మాజీ మున్సి పల్ ఛైర్మెన్ డాక్టర్ ఎస్.ప్రభాకర్‌నాయుడు ముఖ్య అతిధిగా పాల్గొని మంగళశారం పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకర్‌నాయుడు మాట్లాడుతూ అక్షరం, ఆరోగ్యం, పర్యావరణం టీవీఎస్ ట్రస్టు సంకల్పమని, నిరుపేదల చెంతకు నాణ్యమైన విద్య, వైద్యం ట్రస్ట్ మానవీయ హస్తమని, ట్రస్ట్ స్థాపించిన్పటి నుంచి నేటి వరకు పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు సేవా కార్యమ్రకాలు కొనసాగించడం అభినందనీయమని తెలిపారు. తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తన తండ్రి కీశే.తోట వెంకటశేషయ్య జ్ఞాపకార్థం 2019లో ట్రస్ట్ ను స్థాపించి సమాజంలో బడుగు, బలహీతన వర్గాలకు అండగా నిలిచి తోడ్పాటు అందించుట పేద విద్యార్థులకు విద్య,వైద్యం అందించుట, పర్యావరణ పరిరక్షణ సేవా కార్యక్రమాలు చేయడమే లక్ష్యంఅన్నారు. అనంతరం ప్రభాకర్‌నాయుడును ఘనంగా సత్కరించారు. ట్రస్ట్ సెక్రటరీ గాదిరెడ్డి హరినాథ్, పట్టణ జీవీవీ కోశాధికారి టి.సుబ్బరామశర్మ, స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు ఎస్‌కె.బాషా, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

కావలి, జూన్ 9 ప్రభాతవార్త : వైసిపికావలి నియోజకవర్గం ఇన్‌చార్జ్ కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై ఇటీవల కొన్ని పరిణామాలపై కొందరు కూటమి నాయకులు ఉద్దేశపూర్వకంగా దుర్భాషలాడడం, వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నాలుచేస్తున్నారని అలాంటి వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని మంగళవారం వైసిపి నాయకులు, కార్యకర్తలు ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, జడ్పిటిసి సభ్యులు జంపాని రాఘవులు, జిల్లా ఉపాధ్యక్షులు కనమర్లపూడి నారాయణ, జిల్లా కార్యదర్శులు, గంధం ప్రసన్నాంజనేయులు, నెల్లూరు వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు కుందుర్తి శ్రీనివాసులు, కుందుర్తి కామయ్య, మండలి క్రిష్ణారావు, గుడ్లూరి మాల్యాద్రి ఏగూరుఇ చిన్న పుల్లయ్య పరుసు మాల్యాద్రి అఖిల గుంట మాల్యాద్రి, ఆర్‌కె.క్రిష్ణారెడ్డి, గోవిందరెడ్డి, గయాజ్, వెంగల్‌శెట్టి కళ్యాణి, నూర్‌బాషా తదితర నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

లోకేష్‌బాబు గురించి తప్పుగా మాట్లాడితే కావలిలో నిన్ను అడుగు పెట్టనివ్వం..

.మాజీ ఎమ్మెల్యేపై విరుచుకపడ్డ కావలి ఎమ్మెల్యే దగుమాటి

కావలి, జూన్ 9 ప్రభాతవార్త : మంత్రి నారాలోకేష్‌బాబు గురించి మాట్లాడేస్థాయి నీది కాదని మరోకసారి తప్పుగా మాట్లాడితే కావలిలో నిన్ను అడుగుపెట్టనీవ్వమని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి హెచ్చరించారు. మంగళవారం కావలి టిడిపి కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల మాజీ ఎమ్మెల్యే మాట్లాడిన తీరుపై ఎమ్మెల్యే ఘాటుగా సమాధానం ఇచ్చారు. వైసిపి అధికారంలో ఉన్న ప్పుడు రెండువేల ఎకరాలు వెంచర్లు వేసి ఆ నాడు రియల్టర్ల నుంచి కమిషన్లు తీసుకొన్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి వెంచర్ల వేసిన వారు అందరూ నేడు బాగున్నారు. కానీ విజిలెన్స్ తనిఖీల్లో ప్లాట్లు కొన్న వారునష్టపోవాల్సి న అవసంర ఏముందన్నారు. అందుకు బాధ్యులైన వారిపైచర్యలు తీసుకోవాలని తెలిపారు. రియల్టర్లు సహకరించి కోట్లాది రుపాయలు దండుకొని నేడు పెద్దమనిషిగా ఆ 126ఎకరాల సంగతి ఏమైంది అని ప్రశ్నిస్తున్నారే తప్పా ప్రజల స్థితిగతులపై ఏమాత్రం ఆలోచన లేకుండా మాట్లాడుతున్నారని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టి రెండేళ్ళు పూర్తి అయిన సందర్భంగా ఎంతటి అభివృద్ధిని చేసి చూపాను అనేది ప్రజలు గమనిస్తున్నారన్నారు. అమృతపథకం 2 ద్వారా 43కోట్లుతో పనులు ప్రారంభిస్తున్నపుడు గతంలో జరిగిన అవినీతిని వెలికి తీసి చూపడం సహించుకోలేని మాజీ ఎమ్మెల్యే తాను చేసిన అవినీతిని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేయడం దౌర్భాగ్యం అన్నారు. గంజాయి, క్రికెట్ బుకిలు, గ్రావెల్ మాఫియా రేషన్‌మాఫియా అవినీతి సొమ్ము తిన్నది వాస్తవం కాదా అన్ని ప్రశ్నించారు. నూతనంగా ప్రారంభిస్తున్న స్కూల్‌కి బుడమగుంట చెరువు నుంచి గ్రావెల్ ఎలా తోలుకున్నావో, పర్మిషన్ తీసుకున్నావో ఒకసారి ఆలోచించాలని గుర్తు చేశారు. రుద్రకోటలో కొండను దోచుకొని సంపాదించుకున్నది మరిచిపోయేలా అందుకు ఎలాంటి ట్యాంక్స్ ప్రభుత్వానికి చెల్లించావో గుర్తుచేసుకోవాలన్నారు. ప్రజలు ప్రశాంతంతగా జీవిస్తుంటే అరాచకాలను సృష్టించడం తగదన్నారు. నీతో ఏమాత్రం ప్రజలకు ఒరిగిందేమి లేదని, నేను కావలికి సేవ చేయాలని వచ్చానని బీద సోదరులం ఒకటే పార్టీలో ప్రజల కోసం సేవ చేస్తున్నాం అనేది గుర్తించుకోవాలన్నా తెలిపారు. ముఖ్యమంత్రి సభను ఇటీవల ఒంటిచేతితో సభను విజయవంతం చేయడం నీకు కనపడలేదా అన్నారు. అక్రమ లేవట్లలో 123 ఎకరాలు ప్రభుత్వ భూమిని వెలికి తీయించిన ఘనత క్రిష్ణారెడ్డిదే అన్నారు. 123 ఎకారలు ప్రభుత్వ భూమి ఉందని అందులో 78ఎకరాల వెలికితీయియిన ఘనత క్రిష్ణారెడ్డిదే అన్నారు. అవినీతికి పాల్పడిన రియల్టరు నీవెంట ఉన్నారని ఆరోజు నీవు ఏం న్యాయం చేశావు ప్రజలకు అని విమర్శించారు. సుభాని బాధితుల నుంచి నష్టపోయిన పైకం రూ.24కోట్లు రావాల్సి ఉండగా వాటిపై అందిన ఫిర్యాదులను పోలీస్‌స్టేషన్‌లో ఉన్నాయన్నారు. నేను అధికారంలోకి వచ్చిన తరువాత సుభాని అవినీతిని గుర్తించ అదుపులోకి తీసుకున్నామని బ్యాంకుల నుంచి రూ.6కోట్లు సీట్ చేపిస్తున్నట్లు అతని ఆస్తులు అన్ని సీజ్ చేసి కస్టర్డ్ వెళ్ళే ఉంచామన్నారు. తొందరలో బాధితులకు నగదు అందజేస్తామన్నారు. క్వారీ జోలికి వస్తే తగ్గేదే లేదని ఒంటరిగానేవచ్చి నీకు బుద్దిచెబుతారని తెలిపారు. కావలి అభివృద్ధి, నాగురించి మాట్లాడితే తగిన మూల్యం తప్పదన్నారు. కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్, పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు,టిడిపి సీనియర్‌నాయకులు గుంటుపల్లిరాజకుమార్‌చౌదరి, కండ్లగుంట మధుబాబునా యుడు, తట్టపత్తి రమేష్, తట్టపత్తి వాసు, దావులూరు దేవకుమార్,, వల్లేరు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పల్లకి సేవ

కోవూరు, జూన్ 9 ప్రభాత వార్త : కోవూరులో వెలసి ఉన్నశ్రీ దక్షిణాముఖ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం ప్రాతకాల మునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయ బద్దంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలునిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకిషోర్ స్వామి, ఫణీంధ్ర స్వామి, భక్తులు ఉన్నారు.

రాజరాజేశ్వరి ఆలయంలో అన్నదానికి 600కేజీల బియ్యం అందజేత

నెల్లూరు, జూన్ 9, ప్రభాతవార్త–విద్య నగరంలోని స్థానిక దర్గామిట్టలో వెలసి యున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి తమ వంతు సహకారంగా నగరానికి చెందిన అడపాల సతీష్‌కుమార్‌రెడ్డి, అరుణమ్మలు 600 కేజీల బియ్యాని జిల్లా దేవాదాయశాఖ అధికారి, సహాయ కమిషనర్ కోవూరు జనార్ద న్‌రెడ్డికి మంగళవారం అందజేశారు. మాట్లాడుతు ప్రతి శుక్రవారం ఆలయానికి విచ్చేసే వేలాది భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని దాతల సహాయంతో నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నామన్నారు. అవకతవకలను ఎటువంటి ఆస్కారం లేకుండా బయోమెట్రిక్ ద్వారా చేపడుతున్న ఈ అన్న ప్రసాద వితరణ ఇలాకే కొనసాగేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ ఏలూరు శిరీష, పాలక మండలి సభ్యులు , అర్చక స్వాములు తదితరులు పాల్గొన్నారు.

యెజ్డీ,బీఎస్‌ఏ స్క్రాంబ్లర్‌లకు విశేష స్పందన

నెల్లూరు, జూన్ 9, ప్రభాతవార్త –విద్య ఇటీవల తాము విడుదల చేసిన యెజ్డీ, బిఎస్‌ఏ స్క్రాంబ్లర్స్‌కు వినియోగదారుల నుండి విశేష ఆదరణ లబిస్తుందని ,ఇది తమకెంతో గర్వకారణమని క్లాసిక్ లెజెండ్స్ సహ స్థాపకులు అనుపమ్ థరేజా పేర్కొన్నారు. మంగళవారం నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు యెజ్డీ స్క్రాండబ్లర్ 350, బీఎస్‌ఏ స్క్రాంబ్లర్650 మోడల్లను నగర ప్రయాణాలు, మైవే రైడింగ్, తేలికపాటి ఆఫ్‌రోడ్డు, హైవే ప్రయాణాలకు అనుగుణంగా తయారుచేయటం జరిగిందన్నారు. యెజ్డీ 350 స్క్రాంబ్లర్‌లో నూతన సాంకేతికతో రూపొందిచన లిక్విడ్‌కూల్డ్ కటార్ ఇంజన్ ను అమర్చగా దీని ప్రారంభ ధర రూ.199950గా ఉందన్నారు. బిఎస్‌ఏ స్కాంబ్లర్ 650 సిసి సింగిల్ సిలిండర్ ఇంజన్‌ను అర్చగా దీని ధర మూడు లక్షలకు పైగా ఉందని పేర్కొన్నారు. ఈ రెండమెడళ్ల పరితీరు, ఆకర్షనీయత వినియోదగారులను మరింతగా ఆకర్షిస్తున్నాయని, 4 సంవత్సరాలు, లేదా 50వేల కిలోమీటర్ల వారంటీ ఇవ్వటం జరుగుతుందన్నారు. దేశవ్యాప్తంగా 400కుపైగా సర్వీసు సెంటర్స్ ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పేరుతో కూటమి ప్రభుత్వంతో మహిళలకు మోసం

మనుబోలు జూన్ 9 ప్రభాతవార్త తమ నాయకులు కార్యకర్తల జోలికి ఎవరైనా వస్తే తాటతీస్తానని మాజీ మంత్రి వైసిపి జిల్లా అద్యక్షులు కాకాణి గోవర్దన్‌రెడ్డి హెచ్చరిం చారు. మనుబోలులోని పద్మావతి కళ్యాణ మండపంలో మంగళవారం చంద్రబాబునాయుడు వెన్నుపోటుకు రెండేళ్లు అన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తమ నాయకుల మీద కార్యకర్తల మీద దాడులు ఎక్కువగా జరిగాయని విమర్శించారు. ఎవరైతే దాడులకు పాలుపడ్డారో వారందర్ని గుర్తుపెట్టుకొని తమ ప్రభుత్వం అధికారంలోకి రాగేనే వారి సంగతి చూస్తామన్నారు. దెబ్బకు దెబ్బ తీస్తామన్నారు అనంతరం వైసిపి రాష్ట్ర వర్కింగ్ మహిళా అద్యక్షులు కాకాణి పూజిత మాట్లాడుతు చంద్రబాబు హయాంలో జరుగుతున్న దాడులు గురించి టీవీ ద్వారా వివరించారు. కూటమి ప్రభుత్వం చంద్రాబునాయుడు పరిపాలనలో మహిళల మీదే దాడులు ఎక్కువగా జరిగాయని అన్నారు. సూపర్ సిక్స్‌లో ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు కాలేదన్నారు. మహిళలను మోసం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్కడే అని అన్నారు. చంద్రబాబు మోసాలకు తగిన బుద్ధి చెప్తామన్నారు. ఈకార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హం గోపాల్‌రెడ్డి, జడ్‌పిటిసి చిట్టమూరు అనితమ్మ, అజయ్‌కుమార్‌రెడ్డి, ముంగర రవీంద్రరెడ్డి, కడివేడికి చంద్ర శేఖర్‌రెడ్డి, దాసరి బాస్కర్ గౌడ్, ఎంపిపి వజ్రమ్మ, కిషోర్ నాయుడు,కుడుముల వెంకటరమణగౌడ్, ఉగ్గుముడి శశికుమార్‌రెడ్డి, గుండాల ఆదినారాయణ,దువ్వూరు సుధాకర్‌రెడ్డి, కోనూరు కోటేశ్వరగౌడ్, దాసరి మహేంద్రవర్మ, తుపాకుల గిరి,గుంజి రమేష్, గురివింద పూడి మస్తాన్‌యాదవ్,మల్లికార్జు న,శివరాం,తుల సిరామ్‌యాదవ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఇంటిల్లిపాది పస్తులతో అల్లాడుతున్నాం..

- పారిశుద్ధ్య కార్మికుల ఆవేదన పట్టదా..!
- పెండింగ్‌లో ఉన్న 6 నెలలు జీతాలు చెల్లించాలి
- ఏరియా ఆస్పత్రి ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల ధర్నా

గూడూరు, జూన్ 9, ప్రభాతవార్త గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు 6 నెలల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని గూడూరు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి. శశికుమార్, పట్టణ కన్వీనర్ సునీల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఏరియా ఆస్పత్రి ఎదుట పారిశుధ్య కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు గత 6 నెలలుగా జీతాలు ఇవ్వలేదన్నారు. వారు పస్తులు ఉంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. వారి పిల్లలకు పాఠశాల ఫీజులు కట్టుకొలేక బడి మానేస్తున్నారన్నారు. వారి పిఎఫ్ ఖాతాలోని డబ్బులను చెల్లించాలన్నారు. వారికి పని భద్రత కల్పించాలన్నారు. కాంట్రాక్టర్ మారినా ఇప్పుడు పనిచేస్తున్న కార్మికులను కొనసాగించాలన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యధోరణితో జీతాలు పెండింగ్‌లో పడుతున్నాయన్నారు. ఇకనైనా ప్రతి నెలా జీతం సక్రమంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పని ఒత్తిడితో సతమతమవుతున్న, జీతాలు మాత్రం సక్రమంగా రావట్లేదన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి షేక్ జమాలుల్లా మాట్లాడుతూ 20 ఏళ్లుగా ఏరియా ఆస్పత్రిలో పారిశుధ్య కార్మికులుగా 20 మంది మహిళలు పనిచేస్తున్నారని, కాంట్రాక్టర్ మారినప్పుడల్లా కార్మికులను మార్చాలని, కొంత మందిని నిలిపివేయాలని నూతన కాంట్రాక్టర్ ప్రయత్నించడం దారుణమన్నారు. కరోనా సమయంలో సొంత బంధువులు దూరంగా ఉన్నా పారిశుధ్య కార్మికులు కరోనా రోగులకు ప్రాణాలకు తెగించి సేవలు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వెంటనే కార్మికులకు రావా ల్సిన ఆరు నెలల జీతాలు వారి ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. పారిశుధ్య కార్మికురాలు వాణి మాట్లాడుతూ కాంట్రాక్టర్ రోజుకో రకంగా మాట్లాడుతూ ఆరు నెలల జీతాలు నిలిపివేశారన్నారు. అప్పులు పెరిగి ఇంటిల్లి పాది పస్తులుండాల్సి న దుస్థితి నెలకొందని వాపోయారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి జమాలుల్లా, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

శాఖాహారం ఆరోగ్యానికి మంచిది :ఆర్డీవో అరుణ కుమారి

గూడూరు, జూన్ 9, ప్రభాతవార్త శాకాహారంతో ఆరోగ్యమైన జీవనం గడపవచ్చు అని గూడూరు ఆర్డీవో అరుణ కుమారి పేర్కొన్నారు. ప్రకృతి పిరమిడ్ ధ్యాన ఆరోగ్య కేంద్రం, బుద్ధ పీరమిడ్ ధ్యాన ఆశ్రమం వారి సౌజన్యంతో చాణక్య అడ్మినిస్ట్రేషన్ సహకారంతో పట్టణంలోని వివేకానంద రోడ్డు నుండి బయలు దేరి పట్టణ పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా గూడూరు ఆర్డీవో అరుణ కుమారి పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనసాహారం తినడం వల్ల అనేక రోగాలు వస్తాయని శాకాహారం ద్వారా ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చునని, జీవహింస చేయరాదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్పిరిచ్యువల్ టాబ్లెట్స్, సమ్మా ఆజీవ ప్రాజెక్ట్ ఇంచార్జ్ దేవరాజు, ర్యాలీ నిర్వాహకులు ఆచార్య శ్రీనివాస్, ధ్యాన మిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

జొన్నవాడ కామాక్షితాయి సన్నిధిలో యోగా తరగతులు

బుచ్చి జూన్ 9ప్రభాతవార్త అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 సందర్భంగా శ్రీమల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవ స్దానంలో 14 రోజులు పాటు యోగా దినో త్సవాలు నిర్వహిస్తున్నట్లు సాధకులు నేల నూతల బాస్కర్ రామూర్తి చే యోగసాధన కా ర్యక్రమంలో ఉదయం 7 గంటలకు దేవస్థానం ప్రాంగణంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈకార్యక్రమానికి పతంజలి యోగా జిల్లా అ ద్యక్షులు శ్రీ విజయ్‌కుమార్‌రెడ్డి చే యోగసాధన కార్యక్రమం ఉదయం 7 గంటలకు దేవస్దాన ప్రాంగణంలో ఘనంగా నిర్వహించబడింది. ఈకార్యక్రమానికి పతంజలి యోగా జిల్లా అద్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గోని యోగా యొక్క ప్రాముఖ్యతను వివరించారు. యోగ ద్వారా శారీరక దృడత్వం మానసికప్రశాంత,ఏకాగ్రత మరియు ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని పొందవచ్చునని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరు నిత్యం యోగా సాధన చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో దేవస్దానం సిబ్బంది, అర్చకులు,భక్తులు గ్రామస్తులు,

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌కి ఘన స్వాగతం

నెల్లూరు, జూన్ 9, ప్రభాతవార్త – వైద్యం విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ 10, 11, 12వ స్నాతకోత్సవ (కాన్వొకేషన్) కార్యక్రమంలో పాల్గొనేందుకు నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్ హెలీపాడ్‌కు మంగళవారం ఉదయం 11.15 గంటలకు చేరుకున్న రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌కి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అపూర్వ స్వాగతం పలికారు. రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌కి ఘన స్వాగతం పలికిన వారిలో నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఇన్చార్జి ఎస్పీహర్షవర్ధన్ రాజు, జిల్లాపరిషత్ ఛైర్పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నెల్లూరు నగర మేయర్ సుజాత, విక్రమ సింహపురి యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డా. సునీత, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ బడి.. ఇంటర్నేషనల్ స్టడీ..

– మూలపేట డీఎస్ఆర్ స్కూల్‌ను పరిశీలించిన పొంగూరు షరిణి –
స్కూల్ పనులను స్వయంగా పర్యవేక్షించిన మంత్రి నారాయణ కుమార్తె
– ప్రభుత్వ బడిలో రోబోటిక్ ల్యాబ్ – రికార్డు కాలంలో అంతర్జాతీయ స్థాయి స్కూల్ సిద్ధం
– 8 నెలల్లోనే అద్భుతం.. మూలపేట డీఎస్ఆర్ స్కూల్

నెల్లూరు, జూన్ 9, ప్రభాతవార్త – వైద్యం నెల్లూరు నగర విద్యావ్యవస్థలో కార్పొరేట్ విద్యా సంస్థల గుత్తాధిపత్యానికి తెరదించుతూ ప్రభుత్వ పాఠశాలలు అంతర్జాతీయ ప్రమాణాలతో సరి కొత్త విప్లవానికి శ్రీకారం చుట్టాయి. రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సంకల్పంతో, దాత సుధాకర్ రెడ్డి ఉదారతతో నెల్లూరు 39వ డివిజన్ మూలపేటలో దాదాపు 20 కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మించిన డీఎస్ఆర్ ప్రభుత్వ హైస్కూల్‌ను మంత్రి కుమార్తె పొంగూరు షరిణి స్వయంగా పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె, నెల్లూరులోని 15 ప్రభుత్వ పాఠశాలలను అత్యద్భుతంగా తీర్చిదిద్దే బాధ్యతను మా నాన్న నాకు అప్పగించారని, గతంలో విఆర్ స్కూల్‌కు సెట్ చేసిన స్టాండర్డ్స్ కంటే మిన్నగా ఈ స్కూల్‌ను ముస్తాబు చేశామని సగర్వంగా ప్రకటించారు. 2.5 ఎకరాల విస్తీర్ణంలో, 24,000 చదరపు అడుగుల వైశాల్యంతో 14 హైటెక్ క్లాస్‌రూమ్‌లతో నిర్మితమైన ఈ అక్షరాల కోట జూన్ 12 నుండి ప్రారంభం కానుందని, నర్సరీ నుండి 10వ తరగతి వరకు దాదాపు 500 మంది పైగా నిరుపేద విద్యార్థులు ఇక్కడ అంతర్జాతీయ స్థాయి చదువులను ఉచితంగా అభ్యసించవచ్చని, ఇక్కడి విద్యా ప్రణాళికను తానే స్వయంగా పర్యవేక్షిస్తానని షరిణి స్పష్టం చేశారు. కేవలం 8 నెలల రికార్డు కాలంలో రూపుదిద్దుకున్న ఈ ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్కూళ్లకు మైండ్ బ్లాక్ అయ్యేలా అత్యంత ఆధునిక వసతులను కల్పించారని, రాష్ట్రంలోనే అత్యంత వినూత్నమైన రోబోటిక్ ల్యాబ్, హైడ్రోపోనిక్స్, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్స్‌తో పాటు ప్రత్యేకంగా ఆర్ట్,డాన్స్ రూమ్‌లను ఇక్కడ ఏర్పాటు చేశారన్నారు. కేవలం చదువే కాకుండా విద్యార్థుల శారీరక దృఢత్వం కోసం బెంగళూరు నిపుణులతో ప్రత్యేకంగా సింథటిక్ ఎనామిల్ కోటింగ్ వేయించిన అంతర్జాతీయ స్థాయి కబడ్డీ, బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, క్రికెట్ నెట్స్, బాడ్మింటన్ కోర్టులను సిద్ధం చేశారన్నారు. విద్యార్థుల ఆరోగ్యం కోసం సురక్షితమైన ఆరో ప్లాంట్ తాగునీరు, ప్రథమ చికిత్స కోసం ప్రత్యేక సిక్ రూమ్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. మంత్రి నారాయణ పిలుపునకు స్పందించి ప్రభుత్వ విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇంతటి భారీ ప్రాజెక్టును సాకారం చేసిన దాత సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులకు పొంగూరు షరిణి ఈ సందర్భంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎంపీ బీదకు గౌరవ డాక్టరేట్.. చల్లా సత్కారం

వింజమూరు, జూన్ 9, ప్రభాతవార్త రాజ్యసభ సభ్యులు, ప్రముఖ పారిశ్రామికవేత్త బీద మస్తాన్ రావు యాదవ్‌కు నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా వింజమూరు సొసైటీ ఛైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ ఎంపీ బీద మస్తాన్ రావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చల్లా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజాసేవ సామాజిక సేవ పారిశ్రామిక, విద్యా రంగాలలో బీద మస్తాన్‌రావు అందించిన సేవలకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్ లభించడం శుభ పరిణామం. సమాజ అభ్యున్నతి కోసం పనిచేసే వ్యక్తికి విశ్వవిద్యాలయం అత్యున్నత గౌరవం ఇవ్వడం అభినందనీయం అని అన్నారు. సామాన్య కుటుంబం నుంచి స్వయంకృషితో ఎదిగి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మస్తాన్‌రావు గారు అనేకమందికి ఆదర్శం. విద్య, వ్యాపార, సామాజిక సేవా రంగాలలో ఆయన చూపిన నాయకత్వం, నిబద్ధత వల్లే ఈ గౌరవం దక్కింది అని కొనియాడారు. యాదవ సామాజిక వర్గం నుంచి సామాన్య స్థాయి నుంచి ఎదిగి, దేశ అత్యున్నత సభ రాజ్యసభలో ప్రజల గొంతుకగా నిలుస్తున్న బీద మస్తాన్‌రావు భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు పొందాలని చల్లా ఆకాంక్షించారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఇటీవల నిర్వహించిన స్నాతకోత్సవంలో ఎంపీ బీద మస్తాన్‌రావుకు డాక్టర్ ఆఫ్ లెటర్స్ గౌరవ పట్టాను ప్రదానం చేసింది. బీద గ్రూప్ సంస్థల ద్వారా వేలాది మందికి ఉపాధి కల్పించడం, విద్యా సంస్థల ఏర్పాటు, పేదలకు వైద్య సహాయం వంటి సేవా కార్యక్రమాలను గుర్తిస్తూ ఈ గౌరవం ఇచ్చినట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో వింజమూరు ప్రాంత నాయకులు యాదవ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మాజీ సీఎంను కలిసిన వైసీపీ యువనేత గూడపురెడ్డి

వింజమూరు, జూన్ 9, ప్రభాతవార్త ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాల యంలో ఉదయగిరి నియోజకవర్గ యువ నాయకుడు వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గూడపురెడ్డి వీరశేఖర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట సతీమణి విజయ, కుమారుడు నిహాల్ రెడ్డి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వైఎస్ఆర్‌సీపీ గొంతుకను బలంగా వినిపిస్తున్నందుకు వీరశేఖర్ రెడ్డిని వైఎస్ జగన్ ప్రత్యేకంగా అభినందించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఆయన తనయుడు అభినవ రెడ్డితో కలసి యువ నాయకుడు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో వీరశేఖర్ రెడ్డి చూపుతున్న చొరవను జగన్మోహన్ రెడ్డి ప్రశంసించారు. నియోజకవర్గంలో పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తూ, క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు అండగా నిలుస్తున్న వీరశేఖర్ రెడ్డి సేవలు పార్టీకి ఎంతో అవసరమని వారు కొనియాడారు. రానున్న రోజుల్లో పార్టీ విజయం విజయం కోసం మరింత కష్టపడి పనిచేయాలని నేతలు ఆకాంక్షించారు.

నేడు జెడ్పీలో డీఆర్సీ.. సర్వసభ్య సమావేశాలు

నెల్లూరు, జూన్ 9, ప్రభాతవార్త – కలెక్టరేట్ జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నేడు జిల్లా సమీక్ష సమావేశం (డీఆర్సీ) జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాలు జరగనున్నాయి. ఉదయం డిఆర్సి సాధారణ సర్వ సభ్య సమావేశాలు నిర్వహించనున్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రి ఎన్ఎండి ఫరూక్‌తో పాటు జిల్లా మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జడ్పిటిసిలు ఎంపీపీలు ప్రత్యేక ఆహ్వానితులు ఈ సమావేశాలకు హాజరుకానున్నారు.